V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
14-09-2024

సంపుటి : 01 | సంచిక : 132 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## మంకీపాక్స్ టీకాకు డబ్ల్యూహెచ్ఓ అనుమతి

- ఎంపాక్స్ వ్యాధిపై పోరాటంలో ఇది కీలక అడుగు
- 18 ఏళ్ల వయసు పైబడిన వారికి రెండు డోసుల్లో ఇవ్వాలి
- ముఖ్యమైన ప్రాంతాల్లో తక్షణమే ఈ వ్యాక్సిన్ అందించాలి



**జెనీవా:** ప్రపంచదేశాలను ప్రాణాంతక మంకీపాక్స్ భయాందోళనలకు గురిచేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పురోగతి చోటుచేసుకుంది. పెద్దవారిలో ఎంపాక్స్ నిరోధానికి రూపొందించిన వ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతి ఇచ్చింది. ఆఫ్రికాతో పాటు వివిధ దేశాల్లో వేగంగా విస్తరిస్తోన్న వ్యాధిపై పోరాటంలో ఇది కీలక అడుగు అని పేర్కొంది.బవేరియన్ నార్డిక్ సంస్థ అభివృద్ధి చేసిన ఎంపాక్స్ వ్యాక్సిన్ను వ్యాక్సిన్ అలయన్స్ గావీతోపాటు మిగతా2లో...

## హైడ్రా తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి



- ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా..
- నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారు
- జీవో 99పై వివరణ ఇవ్వాలి
- ప్రభుత్వానికి ఆదేశాలు జారీ

**విశ్వంభర, హైదరాబాద్:** హైడ్రా తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారని హైడ్రాను ప్రశ్నించింది. జీవో 99పై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. హైడ్రాకు ఉన్న అధికారాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది.



## కేజ్రీవాల్‌కు భారీ ఊరట

- బెయిల్ మంజూరుచేసిన సుప్రీం
- ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దని ఆదేశం
- జైలు నుండి విడుదలైన ఢిల్లీ సీఎం
- స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు, ఆప్ కార్యకర్తలు
- విభజన శక్తులపై పోరాటం కొనసాగిస్తానని ప్రకటన

**ఢిల్లీ:** మద్యం విధానానికి సంబంధించిన అవకతవకల వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు భారీ ఊరట లభించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహాడ్ జైలు నుంచి బయటకు రానున్నారు. మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో తన అరెస్టును సవాల్ చేయడంతో పాటు.. బెయిల్ మిగతా2లో...

## తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

- రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా?
- రాళ్లదాడి చేసిన వారికి రాచమర్యాదలు చేశారు
- ఫిర్యాదు చేయడానికి వెళ్తే తమను అరెస్ట్ చేశారు
- బీఆర్ఎస్ నేతలపై దాడులు జరిగితే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరు?
- మీడియాతో మాజీ మంత్రి హరీశ్‌రావు

2



## డబ్బుల కోసం చాచిన చేయే.. మార్గనిర్దేశం చేసేలా..



### సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం

- ట్రాన్స్ జెండర్లకు సరికొత్త ఉపాధి
- ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించుకోవాలని ఆలోచన
- పరిశీలించి, విధానాలు రూపొందించాలని ఆదేశాలు
- పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను ఉపేక్షించరాదు
- పూర్తి స్థాయి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలి
- తప్పుడు నివేదికలు సమర్పించిన అధికారులపై చర్యలు తప్పవు
- జీహెచ్ఎంసీ పరిధిలో కీలక పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

**ఎలాంటి ఉపాధి అవకాశాలు దొరక్క యాచించటమే తమ వృత్తి అన్నట్టుగా మారిపోయిన ట్రాన్స్ జెండర్లకు ఓ మార్గం చూపే దిశగా సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాన్స్ జెండర్‌లను వాలంటీర్స్‌గా ఉపయోగించుకునే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. హోంగార్డ్స్ తరహాలో వీరికి కూడా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారి వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు.ఈ ఆలోచన ద్వారా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారికి సమాజంలో గౌరవం తీసుకురావడమే కాకుండా, నగర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో కూడా ఒక కొత్త మార్గం చూపించినట్లు అవుతుందని సీఎం భావిస్తున్నారు .**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

ప్రస్తుతం ట్రాన్స్ జెండర్లు కూడా చదువుకుంటూ రకరకాల ఉద్యోగాలు చేస్తూ.. గౌరవంగా జీవిస్తున్నారు. కానీ.. చాలా మంది ఇప్పటికీ దుకాణాలలో, జంక్షన్ల దగ్గర, రైళ్లు, బస్సుల్లో ఇలా ఎక్కడపడితే అక్కడ.. బిక్షాటన చేస్తూ.. ప్రజలను ఇబ్బంది పెడుతుండటం గమనార్హం. అయితే.. జీవితంలో గౌరవంగా బతకాలని భావించే చాలా మంది ట్రాన్స్ జెండర్లకు మాత్రం సమాజంలో ఉపాధి అవకాశాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది వారిని పనుల్లో పెట్టుకునేందుకు నిరాకరిస్తుండటం శోచనీయం. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న మిగతా2లో...



ఎన్నికల వేళ.. జమ్మూలో

## ఒకేరోజు రెండు ఎన్‌కౌంటర్లు

- ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టిన భారత సైన్యం
- నలుగురు సైనికులకు గాయాలు

2



## 25 వేల మందితో బందోబస్త్

- గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు సిబ్బంది
- విగ్రహాలు దాదాపు లక్ష వరకు ఉండొచ్చు
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

2

అప్పుడు హైజాక్ అయిన విమానంలో

## మా నాన్న ఉన్నారు

షాకింగ్ విషయం చెప్పిన జైశంకర్

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 115 | ₹ 137 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 199 | ₹ 226 |



## వరద నష్టం రూ.10,320 కోట్లు

### నిబంధనలు లేకుండా తక్షణమే విపత్తు సాయం చేయండి..

- కేంద్ర బృందానికి నివేదించిన సీఎం రేవంత్
- మానవీయ కోణంలో తెలంగాణను ఆదుకోవాలి
- పెద్దమొత్తంలో సాయం చేయాలి
- కేంద్ర బృందానికి మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో వరదలతో జరిగిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. వరదలతో తీవ్రంగా నష్టపోయినట్లు కేంద్ర బృందానికి వివరించారు. తెలంగాణాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందంతో సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మిగతా2లో...

తెలుగు రాష్ట్రాలకు రెండు వందే

## భారత్ కొత్త రైళ్లు

- ప్రధాని మోదీ గణపతి నవరాత్రుల కానుకగా మంజూరు చేశారన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- సెప్టెంబర్ 16న ప్రారంభించనున్న ప్రధాని



2

## గ్రీన్ పవర్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వాములను చేయండి
- వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్ ను ఏర్పాటు చేయాలి: డిప్యూటీ సీఎం భట్టి



3

# తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నేతల గృహనిర్బంధం నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు.. కౌశిక్‌రెడ్డి ఇంటిపై రాళ్లదాడి చేసిన వారికి రాచమర్యాదలు చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి వెళ్తే తమను అరెస్ట్ చేశారని మండిపడ్డారు.కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగినప్పుడు డీజీపీ ఎందుకు స్పందించలేదని, బీఆర్ఎస్ నేతలపై దాడులు జరిగితే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. గురువారం జరిగిన ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమని అన్నారు. అరెకపూడి గాంధీని గురువారమే హౌస్ అరెస్ట్ చేసి ఉంటే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగేది కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో అరాచక పాలన గురించి రాహుల్‌గాంధీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును పక్కదారి పట్టించడానికే కౌశిక్‌రెడ్డిపై దాడికి దిగారని ఆరోపించారు. మాపై ఎన్ని రాళ్లు వేస్తారో వేయండి.. వాటితోనే మళ్లీ అధికారంలోకి వస్తాం అని హరీశ్‌రావు అన్నారు.

# 25 వేల మందితో బందోబస్తు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అన్ని శాఖల సమన్వయంతో గణేష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలకు రెండు వందే భారత్ కొత్త రైళ్లు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలుగు ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రుల కానుక అందించారు. ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే ఉద్దేశంతో.. రైలు కనెక్టివిటీని మరింత పెంచుతున్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. వందేభారత్ రైళ్ల పరంపరలో భాగంగా.. మరో రెండు రైళ్లను తెలుగు రాష్ట్రాలకు కేటాయిస్తూ ప్రధాని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 4 వందేభారత్ రైళ్లు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి సర్వీసులు అందిస్తుండగా.. తాజాగా 5వ వందేభారత్ రైలును కూడా ప్రధాని కేటాయించారని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ రైలు సికింద్రాబాద్, నాగ్‌పూర్ మధ్య సేవలు అందించనుంది. ఇదే క్రమంలో విశాఖ, దుర్గ్ (ఛత్తీస్‌గఢ్) మధ్య మరో వందేభారత్ ట్రైన్ అందుబాటులోకి రానుంది. ఈ రెండు రైళ్లను సెప్టెంబర్ 16న ప్రధానమంత్రి అహ్మదాబాద్ నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ రోజు ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా 10 వందేభారత్ ట్రైన్స్‌కు పచ్చజెండా ఊపనున్నారు. సామాన్య ప్రజలకు వందే భారత్ ట్రైన్స్ అనువుగా ఉండటంతో.. ఎక్కువమంది ఆదరిస్తున్నారని , 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో 100 శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉండటం కారణంగా.. కేంద్ర ప్రభుత్వం ఈ రైళ్లతో వీలైనన్ని ప్రాంతాలను అనుసంధానించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్- నాగ్‌పూర్ వందేభారత్ ట్రైన్.. నాగ్‌పూర్ నుండి మార్నింగ్ 5:00 గంటలకు స్టార్టయ్యి మధ్యాహ్నం 12:15 గంటలకు సికింద్రాబాద్ రీచ్ అవుతుంది. రిటన్ జర్నీలో సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 1:00 గంటలకు బయలుదేరి రాత్రి 8:20 గంటలకు నాగ్‌పూర్ రీచ్ అవుతుంది. 578 కిలోమీటర్ల ప్రయాణాన్ని 7.15 గంటల్లో కంప్లీట్ చేయనుంది. ఈ ట్రైన్‌కు కాజీపేట, రామగుండం, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్ స్టేషన్లలో ఆగనుంది. అటు ఏపీ ప్రజల కోసం..విశాఖ నుంచి ఛత్తీస్‌గఢ్ లోని దుర్గ్ ప్రాంతానికి వెళ్లనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. రాయ్‌పూర్, మహాసముంద్, ఖరియార్ రోడ్, కాంతబంజి, తిత్లాగఢ్, కేసింగా, రాయగడ, విజయనగరం మీదుగా విజాగ్ రీచ్ అవ్వనుంది. ఈ సర్వీస్ మూడు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా) పాసింజర్స్‌కు సర్వీసు అందిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు.

# ఎన్నికల వేళ.. జమ్మూలో ఒకేరోజు రెండు ఎన్ కౌంటర్లు

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ లో వరుస ఎన్కౌంటర్లు కలవరం సృష్టించాయి. కరువాలో జరిగిన ఎన్కౌంటర్ లో ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుపెట్టింది. మరోవైపు కిశ్త్ వాడ్ జిల్లాలో జరిగిన మరో ఎన్కౌంటర్ లో నలుగురు సైనికులు గాయపడినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. మరికొన్ని రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లోనే ఈ ఎన్కౌంటర్లు జరగడం గమనార్హం.కిశ్త్ వాడ్ లోని ఉగ్రవాదుల కదలికలు ఉన్నాయని ఇంటలిజెన్స్ నుంచి వచ్చిన సమాచారంతో జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి భారత సైన్యం ఆపరేషన్ చేపట్టింది. శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. అనంతరం జరిగిన కాల్పుల్లో నలుగురు సైనికులు గాయపడ్డారు. వారిని సమీపంలోని కమాండ్ సెంటర్కు తరలించిన దళాలు.. ఉగ్రవాదుల కోసం వేట కొనసాగిస్తున్నాయి. జులైలో డోడా జిల్లాలో నలుగురు సైనికులకు పొట్టన పెట్టుకున్న ఘటనలో ఈ ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు సైనిక వర్గాలు భావిస్తున్నాయి. కరువా జిల్లాలో జరిపిన జరిగిన ఎన్కౌంటర్లో లో ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుపెట్టింది.



# డబ్బుల కోసం చాచిన చేయే.. మార్గనిర్దేశం చేసేలా..

**(మొదటి పేజీ తరువాయి)**
నిర్ణయం గనక.. అమలయితే.. జంక్షన్లలో డబ్బుల కోసం వాహనదారుల దగ్గర చేయి చాచిన ఆ ట్రాన్స్ జెండర్లు.. రేపు ట్రాఫిక్‌ను నియంత్రించే అవకాశాలున్నాయి. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలను సులభతరం చేయడానికి ముఖ్యమంత్రి ముందుకొచ్చిన వినూత్న ఆలోచన ఇప్పుడు హాట్ టాపిక్ గా ఇంట్రెస్టింగ్ గా మారింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీని వాలంటీర్లుగా వినియోగించేందుకు పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఈ ఆలోచన ద్వారా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారికి సమాజంలో గౌరవం తీసుకురావడమే కాకుండా, నగర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో కూడా ఒక కొత్త మార్గం చూపించినట్లు అవుతుందని సీఎం భావిస్తున్నారు . హోమ్ గార్డ్స్ తరహాలో వారికి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కూడా అధికారులను సీఎం సూచించారు.



జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్ పాత్ ల అభివృద్ధి, శుభ్రత, ఇతర కీలక పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా, టెండర్ల ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల పనితీరుపై ఆయన నిశితంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టర్లను ఏమాత్రం ఉపేక్షించరాదని సీఎం ఆదేశించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్ల అభివృద్ధి, ఫుట్ పాత్ నిర్మాణాలు, ఇతర పనులను గడువులోపు పూర్తిచేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలాగే, నిర్లక్ష్యంగా వ్యవహరించిన, పనులు సరిగ్గా చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను 15 రోజుల్లోగా అందించాలని సూచించారు. తప్పుడు నివేదికలు సమర్పించిన అధికారులపై చర్యలు తప్పవని సీఎం రేవంత్ హెచ్చరించారు. నగరంలో అనేక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చర్యలు జరుగుతుండగా, అవి సమయానికి పూర్తవ్వడం కోసం తగిన క్రమశిక్షణతో పని చేయాలని సీఎం ప్రత్యేకంగా ఆదేశించారు. ఇక ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి ట్రాఫిక్ స్ట్రీమ్‌లైన్ చేయడంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీని వాలంటీర్లుగా వినియోగించేందుకు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వాలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హోమ్ గార్డ్స్ తరహా ఉద్యోగాలను పరిగణలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఆసక్తి ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించి, తగిన విధానాలు రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి సూచించిన ఈ కొత్త ఆలోచన ఒకవైపు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి సమాన అవకాశాలు కల్పిస్తుండగా, మరోవైపు నగర ట్రాఫిక్ సమస్యలపై ఒక పరిష్కార మార్గాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఇదివరకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి చరిత్ర సృష్టించబోతోంది. రాష్ట్రంలోనే తొలి గ్రామంగా రికార్డ్ నెలకొల్పేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే అధికారులు సర్వే కూడా చేపట్టారు.ఇప్పుడు ట్రాన్సజెండర్లను ట్రాఫిక్ వాలంటీర్లుగా వారిని పనిచేసే విదంగా చేయడంతో పలు విన్నూత్నమైన మార్పులతో అభివృద్ధివైపు పరుగులు పెట్టిస్తున్నారనే వాదనలు విన్పిస్తున్నాయి.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరద నష్టం రూ.10,320 కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**
ఎంపీ రఘురాం రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేంద్ర రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరిగిన వరద నష్టం గురించి కేంద్ర బృందానికి మంత్రులు వివరించారు. ఎక్కడెక్కడ నష్టం తీవ్రంగా జరిగిందో చెప్పారు. పంటలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల గురించి వివరించడంతో పాటు ఆస్తినష్టం జరిగిన తీరును కూడా కేంద్ర బృందానికి సవివరంగా తెలిపారు. 10,320 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు మానవీయ కోణంలో కేంద్రం పెద్ద మొత్తంలో సాయం చేసి ఆదుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.

**నిబంధనలు లేకుండా తక్షణమే విపత్తు సాయం చేయండి..**

భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన తెలంగాణకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మరోమారు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. విపత్తు నిధుల వినియోగం విషయంలో కేంద్రం అమలు చేస్తున్న కఠినమైన నిబంధనలు సడలించాలని అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న నిబంధనలు చూస్తే.. తెలంగాణ రాష్ట్రం మొత్తం మునిగిపోయినా ఎన్డీఆర్ఎఫ్ లో అందుబాటులో ఉన్న రూ.1350 కోట్లల్లో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకునే పరిస్థితి లేదని ముఖ్యమంత్రి కేంద్ర అధికారుల బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఒక కిలోమీటర్ రోడ్డు దెబ్బతింటే, కేవలం ఒక లక్ష రూపాయలు ఖర్చు చేయాలని రేట్లకు నిర్ణయించారని.. దీంతో తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతో పాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎస్ఆర్ రేట్ల వివరాలను కూడా కేంద్రానికి నివేదిస్తామని, వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రంలో అపార నష్టం సంభవించిందని ముఖ్యమంత్రి వివరించారు. ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన సమగ్ర అంచనాల ప్రకారం రూ.10,032 కోట్ల నష్టం వాటిల్లిందని అన్నారు. ఇంకా పూర్తి వివరాలు రావాల్సి ఉందన్నారు. తనతో పాటు మంత్రులు, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించటంతో భారీగా ప్రాణనష్టం తగ్గిందని చెప్పారు. వేలాది ఇండ్లు దెబ్బతిన్నాయని, లక్షలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయటంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని చెప్పారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెర్వులు కొట్టుకు పోవటంతో నష్టం ప్రాథమిక అంచనాలను మించిపోయిందని వివరించారు.

రాష్ట్రంలో వరదలతో వాటిల్లిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా నిధుల వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతో పాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలను సమీపంలో సురక్షితంగా ఉండే ప్రాంతంలో ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన సాయం అందించాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు.

వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత ఆదుకోవటం కంటే, నివారించే చర్యలపై ఎక్కువ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అన్నారు. వర్షపాతం, హీట్ వేవ్ లాంటి వాతావరణ, పర్యావరణానికి సంబంధించిన విపత్తులపైవీలైనంత ముందుగా హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లపై ఎక్కువగా దృష్టి సారించాలని కేంద్ర బృందానికి ము ఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు ఆదుకునేందుకు, తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్నపోలీసు బెటాలియన్లను ఉపయోగించుకుంటామని సీఎం తన ఆలోచనలను కేంద్ర బృందంతో పంచుకున్నారు. ప్రతి బెటాలియన్లో ఎంపిక చేసిన వంద మందికి ప్రత్యేక శిక్షణను అందిస్తామని అన్నారు. వారికి అవసరమైన పరికరాలు, శిక్షణ, నైపుణ్యం నేర్పేందుకు ఎన్డీఆర్ఎఫ్ సాయం కోరుతున్నామని అన్నారు. మేడారం అటవీ ప్రాంతంలో ఇటీవల దాదాపు 50 వేల ఎకరాల్లో చెట్లు నేలమట్టమైన సంఘటన సమావేశంలో చర్చకు వచ్చింది. అటవీ ప్రాంతంలో జరిగినందున ఎలాంటి ముప్పు వాటిల్లలేదని, మైదాన ప్రాంతంలో జరిగితే భారీ ప్రమాదం వాటిల్లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి సంఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం అభిప్రాయపడింది. అందుకే కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపించి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని ముఖ్యమంత్రి కోరారు. అలాంటి సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పరిశీలించాలని సూచించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర అధికారుల బృందం రెండు బృందాలుగా విడివడి రెండు రోజులుగా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించింది. భారీ వర్షాలతో వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించింది. ఎన్డీఎంఏ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ సారథ్యంలో ని ఈ బృందంలో కేపీ సింగ్ తో పాటు శాంతినాథ్ శివప్ప, మహేష్ కుమార్, నాయల్ కాన్సన్, రాకేష్ మీనా, శశివర్ధన్ రెడ్డి ఉన్నారు.

**మానవీయ కోణంలో తెలంగాణను ఆదుకోవాలి: పొంగులేటి**

ఇ టీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు మానవీయ కోణంలో కేంద్రం పెద్ద మొత్తంలో సాయం చేసి ఆదుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో మంత్రి, అధికారులు బృందంతో వరద నష్టంపై కేంద్ర బృందంతో చర్చలు జరిపారు. ఇటీవల కాలంలో సంభవించిన వరదలకు తెలంగాణ రాష్ట్రం తీవ్రస్థాయిలో నష్టపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. భారీ వర్షాలకు ప్రధాన రహదారులు, కాలనీలు జలమయమయ్యాయి. అనేక ఇళ్లు నీటిలో మునిగిపోయి ప్రజలు నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. ఇండ్లు, పంటలు నష్టపోయి ఆర్థికంగా నష్టపోయారని వివరించారు.

## మంకీపాక్స్ టీకాకు డబ్ల్యూహెచ్ఓ అనుమతి

**(మొదటి పేజీ తరువాయి)**
యూనిసెఫ్ వంటి సంస్థలు కొనుగోలు చేయొచ్చు. తయారీ సంస్థ ఒక్కటే కావడంతో ప్రస్తుతం పరిమిత సంఖ్యలోనే వీటి ఉత్పత్తి జరుగుతోంది. అయినప్పటికీ ముఖ్యమైన ప్రాంతాల్లో తక్షణమే ఈ వ్యాక్సిన్ అందించేందుకు ముమ్మర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది.18 ఏళ్ల వయసు పైబడిన వారికి ఈ వ్యాక్సిన్ ను రెండు డోసుల్లో ఇవ్వాలి. అంతకంటే తక్కువ వయసు ఉన్నవారికి టీకా ఇచ్చేందుకు అనుమతి లేనప్పటికీ.. వ్యాధి ముప్పు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని చిన్నారులు, యుక్తవయసు వారికి దీన్ని ఇవ్వవచ్చని డబ్ల్యూహెచ్వో వెల్లడించింది.

## అప్పుడు హైజాక్ అయిన విమానంలో మా నాన్న ఉన్నారు



**ఢిల్లీ:** భారత విదేశాంగమంత్రి ఎస్.జై శంకర్ షాకింగ్ విషయం ఒకటి వెల్లడించారు. 1984లో హైజాక్ అయిన విమానంలో తన తండ్రి ఉన్నారని వెల్లడించారు. స్విట్జర్లాండ్ లోని జెనీవాలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి.. 'ది కాంధార్ హైజాక్ సిరీస్ గురించి మాట్లాడుతూ ఈ ఆశ్చర్యకర విషయం తెలియజేశారు. "ఈ సిరీస్ నేను చూడలేదు. కాబట్టి దానిపై నేను మాట్లాడలేను. 1984లో కూడా ఒక హైజాక్ జరిగింది. అప్పుడు నేను ఉద్యోగంలో చేరి కొంతకాలమే అవుతోంది. ఆ హైజాక్ ఘటనను డీల్ చేసే బృందంలో నేను కూడా ఉన్నాను. దాంతో ఇంటికి రావడం కుదరదని మా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను. కానీ తర్వాత తెలిసింది ఏంటంటే.. ఆ విమానంలో మా నాన్న ఉన్నారని. అదృష్టవశాత్తూ విమానంలో ఉన్నవారికి ఏమీ కాలేదు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే.. ఒకవైపు హైజాకు సంబంధించిన వ్యవహారాన్ని చూస్తోన్న బృందంలో పనిచేస్తూ.. హైజాక్పై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కుటుంబ సభ్యుల్లోనూ నేను ఉన్నాను" అంటూ ఇంతకాలం ఎవరికీ పెద్దగా తెలియని విషయాన్ని చెప్పి మంత్రి ఆశ్చర్యపర్చారు. ఆగస్టు 24, 1984లో ఈ హైజాక్ ఘటన జరిగింది. భారత్కు చెందిన విమానం IC421కు ఈ పరిస్థితి తలెత్తింది. అది ఢిల్లీ నుంచి టేకాఫ్ అయింది. చండీగఢ్ ల్యాండ్ కాగానే ఏడుగురు హైజాకర్లు కాక్పిట్లోకి చొరబడ్డారు. వారంతా ఆల్ ఇండియా సిఖ్ స్టూడెంట్ ఫెడరేషన్కు చెందినవారు. అందరి వయసు 25 లోపే ఉంది. జర్నైల్ సింగ్ భింద్రన్వాలేతో పాటు ఇతరులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. 36 గంటల పాటు ఆ విమానం నాలుగు విమానాశ్రయాల మధ్య తిరిగింది. అలా ఎంతో ఉద్రిక్త పరిస్థితుల మధ్య చివరకు అందులోని వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

# కేజ్రీవాల్‌కు భారీ ఊరట

**(మొదటి పేజీ తరువాయి)**
కోసం అభ్యర్థిస్తూ కేజీవాల్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది. రూ.10లక్షల పూచీకత్తు, ఇద్దరు షూరిటీలతో ఈ బెయిల్ మంజూరుచేసింది. కేసు గురించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని ఆదేశించింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దని స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా కేజీవాల్ అరెస్టుపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "సుదీర్ఘంగా నిర్బంధించడం అంటే. వ్యక్తి హక్కులను హరించినట్లే. ఈ కేసులో అరెస్టు సరైందే అయినప్పటికీ.. చేసిన సమయం మాత్రం సరిగా లేదు. ఈడీ కేసులో బెయిల్ వచ్చిన వెంటనే సీబీఐ అరెస్టు చేయడం సమంజసం కాదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రతీ వ్యక్తికి 'బెయిల్' అనేది నిబంధన.. జైలు మినహాయింపు'గా ఉండాలి అని మరోసారి వెల్లడించింది. సీబీఐ పంజరంలో చిలుక కాదని నిరూపించుకోవాలని వ్యాఖ్యానించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 21న ఈడీ



అధికారులు కేజీవాల్ ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం లోక్ సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేయగా.. జైలు నుంచి విడుదలయ్యారు. ఆ గడువు ముగియడంతో జూన్ 2న తిరిగి లొంగిపోయారు. కాగా.. ఈ కేసులో జూన్ 20న రౌస్ అవెన్యూ కోర్టు ఢిల్లీ సీఎంకు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. కానీ, దీనిపై ఈడీ అభ్యంతరం వ్యక్తంచేయడంతో మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. అనంతరం జూన్ 25న బెయిల్పై స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో జులైలో ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈడీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు నుంచి బెయిల్ వచ్చిన వెంటనే సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. దీంతో ఈడీ కేసులో ఊరట లభించినప్పటికీ.. ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైల్లో ఉండాల్సి వచ్చింది.

**విభజన శక్తులపై పోరాటం..**

ఈ సందర్భంగా కేజీవాల్ మాట్లాడుతూ.. "ఇంత వర్షంలోనూ పెద్ద సంఖ్యలో వచ్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నా జీవితం దేశానికే అంకితం. లైఫ్లో ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్నా. సత్యమార్గంలోనే నడిచినందు వల్లే దేవుడి ఆశీస్సులు ఉన్నాయి. నన్ను జైలులో పెట్టి మనో ధైర్యాన్ని దెబ్బతీద్దామని కొందరు అనుకున్నారు. కానీ, నేను జైలు నుంచి బయటకు వచ్చాక నా మనోధైర్యం 100 రెట్లు పెరిగింది. భగవంతుడు చూపిన మార్గంలోనే నడుస్తూ.. దేశానికి సేవ చేస్తూనే ఉంటాను. దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే శక్తులపై పోరాటం కొనసాగిస్తాను" అని తెలిపారు. కేజ్రీవాలకు స్వాగతం పలికేందుకు జైలుకు వచ్చిన వారిలో ఆయన సతీమణి సునీతా కేజీవాల్, పంజాబ్ సీఎం భగవత్ మాన్, ఢిల్లీ మంత్రి అతిశీ, మాజీ మంత్రి మనీశ్ సిసోదియా తదితరులు ఉన్నారు.

**జైలు నుండి విడుదలైన కేజ్రీవాల్..**

**ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవాల్ తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో అరెస్టయిన ఆయనకు శుక్రవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అనంతరం విడుదలకు అవసరమైన ప్రక్రియ పూర్తి కావడంతో బెయిలు మంజూరైన కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఆప్ శ్రేణులు, కేజ్రీవాల్ అభిమానులు జైలు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. వర్షం కురుస్తుండగా.. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారందరికీ కేజ్రీవాల్ అభివాదం చేస్తూ కనిపించారు.**

## రూ.25 లక్షల నజరానా

# బుచ్చిబాబు విజేత హైదరాబాద్‌కు భారీ ప్రైజ్‌మనీ

### హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ జట్టుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శినపల్లి జగన్‌మోహన్ రావు భారీ నగదు బహుమతి ప్రకటించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఆల్ ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ చాంపియన్‌గా అవతరించింది. గత రంజీ సీజన్‌లో ప్లేట్ డివిజన్‌లో అజేయ విజేతగా నిలిచిన హైదరాబాద్.. బుచ్చిబాబు టోర్నమెంట్‌లోనూ మేటి జట్లను చిత్తు చేసింది. గత సీజన్ నుంచి ఇప్పటివరకు అజేయ రికార్డును కొనసాగించింది. దీంతో సీనియర్ మెన్స్ జట్టుకు రూ. 25 లక్షల నగదు బహుమతి అందజేస్తున్నట్టు జగన్‌మోహన్ రావు ప్రకటించారు. 'సుదీర్ఘ విరామం అనంతరం హైదరాబాద్ జట్టు బుచ్చిబాబు టోర్నమెంట్‌లో విజేతగా నిలువటం సంతోషంగా ఉంది. గత సీజన్‌లో రంజీ ప్లేట్ చాంపియన్‌గా నిలిచాం. ఈ సీజన్లో రంజీ ఎలైట్ చాంపియన్‌గా నిలువాలనేది నా లక్ష్యం. క్రికెటర్లకు, సహాయక సిబ్బందికి అవసరైన సహాయ సహకారాలు హెచ్‌సీఏ అందించేందుకు సిద్దంగా ఉంది' అని జగన్ అన్నారు. 'హైదరాబాద్ ఈ సీజన్లో గెలవటం అలవాటుగా మార్చుకున్నది. సొంతగడ్డకు ఆవల సాధించిన విజయం ఎప్పుడూ ప్రత్యేకమే. బుచ్చిబాబు ట్రోఫీ సైతం ఈ కోవలోకే వస్తుంది. రానున్న రంజీ సీజన్ కోసం హైదరాబాద్ క్రికెటర్లు సిద్ధం కావాలి. ప్రధానంగా బౌలర్లు ప్రతికూల పరిస్థితుల్లోనూ పట్టువదలని ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. పిచ్ నుంచి సహకారం దక్కకపోయినా రెండు ఎండ్‌ల నుంచి బ్యాటర్లపై ఒత్తిడి పెంచటం ముఖ్యం. ఇది హైదరాబాద్ బౌలర్లు సాధన చేయాలి' అని భారత మాజీ క్రికెటర్, పేస్ దిగ్గజం వెంకటేశ్ ప్రసాద్ అన్నారు. బుచ్చిబాబు ట్రోఫీతో హైదరాబాద్‌కు చేరుకున్నకెప్టెన్ రాహుల్ సింగ్, కోచ్ చటర్జీ, జట్టును శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమంలో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సత్కరించారు. క్రికెటర్లు, సహాయక సిబ్బందితో అధ్యక్షుడు జగన్, కార్యదర్శి దేవరాజ్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి ఏ ఉపాధ్యక్షులు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రెటరీ బసవరాజు, ట్రెజరర్ సీజే శ్రీనివాస్ రావు, హెచ్‌సీఏ సీనియర్ సభ్యుడు ఆగమ్ రావు, సీఈవో సునీల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రీన్ పవర్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ (పునరుత్పాదక విద్యుత్తు,) ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు వెను వెంటనే ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంపుదల, వివిధ వర్గాలకు ఆదాయం సమకూర్చడంపై శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం వరకు అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో ఉన్న రైతుల వ్యవసాయ పంపు సెట్లకు సంపూర్ణంగా ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా వచ్చే విద్యుత్తును పవర్ గ్రిడ్ కు అనుసంధానం చేయాలని ఆదేశించారు.

దీని ద్వారా రైతులకు పంటలపై ఆదాయమే కాకుండా ప్రతి ఏటా సోలార్ పవర్ ద్వారా రైతులకు వ్యక్తిగతంగా నిర్దిష్టంగా ఆదాయం సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతోపాటు కొన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద గృహాలకు సంతృప్త స్థాయిలో (సాచ్యురేషన్) ప్రభుత్వ ఖర్చులతో సోలార్ పవర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి తో పాటు మధిర నియోజకవర్గం లోని సిరిపురం ఈ తరహాలో మరో 20 గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసుకొని ముందుకు పోవాలని ఆదేశించారు. సోలార్ పవర్ తో ఆయా గ్రామస్తులకు ఆదాయాన్ని సమకూర్చడమే ప్రభుత్వం ప్రధాన ఆలోచన అని వివరించారు.

రాష్ట్రంలోని ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు ఐదు నుంచి పది మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకోవడానికి వారిని ప్రోత్సహించాలని ఆదేశించారు. సోలార్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు నుంచి రుణాలు సైతం ఇప్పించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్తును ప్రభుత్వమే బై బ్యాక్ పద్దతి లోకొనుగోలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ ఎనర్జీ దోహదపడుతుందని తెలిపారు. మహిళలను పారిశ్రామిక వేత్తలు గా అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ సంకల్పం అన్నారు.

మొత్తంగా గ్రీన్ ఎనర్జీ ద్వారా పల్లెల్లో రైతులకు, పేదలకు స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక స్వావలంబన కలిగే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర విద్యుత్తు అవసరాలు సైతం పూరించే అవకాశం లభిస్తుందని , వివిధ వర్గాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రెడ్ కో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీల ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## సినీ గేయరచయిత చంద్రబోస్, బలగం ఫేం కొమురవ్వలకు

# పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం

- కళాకారులు కొమురవ్వకు వరంగల్ లో ఇల్లు నిర్మిస్తాం: మంత్రి పొన్నం
- తన జీతం నుండి లక్ష రూపాయలు అందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



విశ్వంభర,హైదరాబాద్ : పొన్నం సత్తయ్య గౌడ్ 14 వ వర్థంతి సందర్భంగా రవీంద్ర భారతిలో పొన్నం సత్తయ్య గౌడ్ 2024 జీవన సాఫల్య పురస్కారాన్ని సినీ గేయ రచయిత ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ బలగం ఫేం కొమురవ్వలకి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్,ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య ,ఎమ్మెల్యేలు అందించారు..ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం పొందిన చంద్రబోస్ బలగం ఫేం కొమురవ్వ లకు శుభాకాంక్షలు తెలిపారు.14వ వర్థంతి సందర్భంగా పొన్నం సత్తయ్య గౌడ్కి నా నివాళులు అర్పించారు.పొన్నం సత్తయ్య పేరిట చారిటేబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న వారి కుమారులకు అభినందనలు తెలిపారు.పొన్నం సత్తయ్య గౌడ్ చదువు విలువ తెలుసు. చదువు రాకున్నా కుమారులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించారనీ కొనియాడారు.కుటుంబ విలువలను కాపాడుతూ ఉమ్మడి కుటుంబ విలువల గురించి నేర్పించారని ,భూమిని నమ్ముకొని ఆదర్శ రైతు అని అభినందించారు.భూమి పుత్రుడు సత్తయ్య గౌడ్ పేరు మీద కవులకు కళాకారులకు సన్మనించుకొని సత్కరించుకోవడం అభినందనీయమన్నారు.బలగం సినిమాలో పాడిన పాటలు కొమురవ్వ ఉమ్మడి కుటుంబాల విలువలు తెలిపారని కష్టాల్లో ఉన్న కొమురవ్వ ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా సహకారం ఉంటుందని తన జీతం నుండి తక్షణమే లక్ష రూపాయల సహాయం అందిస్తామని పేర్కొన్నారు. సాంకేతిక & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ ఇంటికి అనేక సందర్భాల్లో వెళ్ళే వాళ్ళమని వారి ఆప్యాయతలు అనురాగాలు ,ఉమ్మడి కుటుంబ జీవన విధానాన్ని కొనియాడారు.మొత్తం కరీంనగర్ జిల్లాలో ఉమ్మడి కుటుంబం అంటే పొన్నం కుటుంబమని అభినందించారు.పొన్నం ప్రభాకర్ మంత్రి అయినా వారి అన్నదమ్ములు ,అక్క చెల్లెళ్ల సలహాలు సూచనలతో ముందుకు వెళ్తారనిఎంత ఎదిగినా ,ఒదిగి ఉండాలని ఆయనను చూస్తే తెలుస్తుందన్నారు. ఎక్సైజ్ & పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పొన్నం సత్తయ్య గౌడ్ 14 వ వర్థంతి అయినా తరువాత కూడా ఇంత పెద్ద కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటున్నామంటే వారి జీవన విధానం తెలుపుతుందని అభినందించారు.పుత్రులు ప్రయోజకులు కావాలని పొన్నం సత్తయ్య దంపతులు కోరుకునేదని గుర్తు చేశారు. జీవన విధానం ధ్వంసం అయింది కాబట్టి ఈ అనర్థాలకు కారణమని పొన్నం సత్తయ్య గౌడ్ ఉమ్మడి కుటుంబం సంస్కృతి సంప్రదాయాలకు నెలవు అని కొనియాడారు. సినీ గేయ రచయిత, పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం గ్రహీత చంద్రబోస్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందనీఅంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అవార్డు అందుకున్నప్పుడు ఎంత ఆనందం కలిగిందో ఇప్పుడు స్థానిక కళాకారులతో కలిసి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.3500 కి పైగా పాటలు పాడాననీ తన పాటకు స్ఫూర్తి ఒగ్గు కళాకారులు కళారూపం అన్నారు.పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం గ్రహీత మాట్లాడుతూ పొన్నం సత్తయ్య గౌడ్ ఐదుగురి సంతానం ఈ అవార్డులు అందుస్తుండడం మంచి పరిణామం అన్నారు.పొన్నం సత్తయ్య గౌడ్ గారి మీద పాట పాడి కొమురవ్వ ఆలపించారు.

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్న సందర్భంలో కొమురవ్వ ఉమ్మడి కుటుంబం పై పాటకు ధన్యవాదాలు తెలిపారు.వారి కుటుంబం తరుపున వరంగల్ లో కొమురవ్వ కు ఇల్లు కడతామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో కొమురవ్వ భర్త కు మంచి చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుండి కొమురవ్వ కు కళాకారుల పెన్షన్ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం సందర్భంగా వారి కుమారుడు ప్రముఖ జర్నలిస్ట్ పొన్నం రవిచంద్ర గౌడ్ వారి బాపును గుర్తుచేస్తున్నారు. బాపుకు కళాకారులు , రచయితలు అంటే ఇష్టమని ఆయనకు ఆరో ప్రాణం రేడియో.. చనిపోయే వరకు రేడియో లో కథలు,నాటికలు వార్తలు వినేవారనీ తెలిపారు. బాపు కు ఒగ్గు కథలు,బుర్ర కథలు అంటే ఇష్టమన్నారు.గత 3 సంవత్సరాలుగా పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్నామనిఈసారి చంద్రబోస్ ,కొమురవ్వలను ఎంపిక చేయడం జరిగిందన్నారు.మొదటి సంవత్సరం లో నలేశ్వరం శంకర్ ,ఒగ్గు కథ ధర్మయ్య ,రెండవ సంవత్సరం నెలిమెల భాస్కర్ ,విమలక్క లకు అందించడం జరిగిందనీ పొన్నం రవిచంద్ర గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యానారాయణ , మేడిపల్లి సత్యం, సంజయ్, శ్రీ గణేష్ , వీర్లపల్లి శంకర్ , నాగరాజు , మేఘారెడ్డి , ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ,బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్,రవాణా రోడ్స్ అండ్ బిల్డింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్ ,బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళభరణం కృష్ణమోహన్ రావు , వెలిచాల రాజేందర్ రావు ,మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి ,రచయిత్రి శ్రీ లక్ష్మి ,సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరి కృష్ణ ,మాజీ ఎమ్మెల్యే అరేపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నగరి వైసీపీ నేతలపై సస్పెన్షన్!



**విశ్వంభర, నగరి :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమిని చవిచూసిన సంగతి తెలిసిందే. కేవలం 11 సీట్లకే ఆ పార్టీ పరిమితమైంది. దాంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ ప్రక్షాళనపై దృష్టి సారించారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి, నగరి మాజీ ఎమ్మెల్యే రోజా ఫిర్యాదుతో నగరి వైసీపీ నేతలపై సస్పెన్షన్ వేటు వేశారు. రాష్ట్ర వైసీపీ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కేజే కుమార్, నగరి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కేజే శాంతి, వీరి కుటుంబ సభ్యులు చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం లో పార్టీకి, తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని నగరి మాజీ ఎమ్మెల్యే రోజా ఇటీవల అధినేతకు ఫిర్యాదు చేశారు. వారిపై అభియోగాలు నిజమని తేలడంతో క్రమశిక్షణ చర్య ల్లో భాగంగా వారిని పార్టీ నుంచి తొలగిస్తున్నామని వైసీపీ అధిష్ఠానం వెల్లడించింది. పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దు చేస్తున్నామని తెలిపింది. ఇకపై వారి కార్యక్రమాలకు, వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని చిత్తూరు జిల్లా వైసీపీ ప్రెసిడెంట్ కేఆర్‌జే భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగరి నేతలను సస్పెండ్ చేస్తూ ఒక లేఖను విడుదల చేశారు.

# ప్రజాపాలన అంటే నిర్బంధించడమేనా ?



### డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి

**విశ్వంభర, మీర్‌పేట్ :** రాష్ట్రంలో ప్రజా పాలన తీసుకొస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులను నిర్బంధించడమేనా అని మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి అన్నారు. శుక్రవారం శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఇంట్లో బీఆర్ఎస్ పార్టీ సమావేశం పిలుపులో భాగంగా విక్రమ్ రెడ్డిని ముందస్తుగా మీర్‌పేట్ పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్బంధాలు, అరెస్టులు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కొత్త ఏమి కాదని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుత పోరాటాలు చేస్తామని అన్నారు. అరికేపుడి గాంధీ వెంటనే కౌశిక్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళ శాసన సభ్యురాలని గౌరవం లేకుండా మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కూడా హౌస్ ఆరెస్ట్ చేయడం దారుణమన్నారు.






# బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజనీతిజ్ఞుడు బూర్గుల

### నేడు ఆయన వర్ధంతి



అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయన న్యాయవాది, బహుభాషా వేత్త, స్వాతంత్య్ర సమర యోధుడు, రాజనీతిజ్ఞుడు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సాహితీ వేత్త. బహు భాషా కోవిదులు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసిన తొలితరం కాంగ్రెస్ నాయకులు. ఆయనే హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పనిచేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు.

రామకృష్ణరావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు.

బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు.1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు.

బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు.

ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు.

హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖులు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమం లోను పాల్గొని కారాగార వాసం అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్య మంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్దత కల్పించారు.

1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్య మంత్రిగా పేరుగాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఆయన అనేక భాషలలో నిష్ణాతులు. అవన్నీ ఆయన సొంతంగా, ఆసక్తితో నేర్చుకున్నవే. అర్ధరాత్రి వరకు ఫైళ్లలో నిమగ్నమై, తర్వాత బూర్గుల సంస్కృతంలో మునిగి తేలేవారు. బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికలో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్కృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరాచార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణ శతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం-మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మద్.గీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వాఙ్మయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించడమే కాకుండా ఎన్నో కావ్యాలకు పీఠికలు రాశారు. అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు. ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది.1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14న గుండెపోటుతో మరణించారు.

## నిస్వార్థ ప్రజాసేవకుడు, నిష్కళంక దేశభక్తుడు
# గాడిచర్ల హరిసర్వోత్తమ రావు

### నేడు ఆయన జయంతి



గాడిచర్ల గురించి ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు చెప్పిన చిరు కవిత:

వందేమాతరమనగనే వచ్చి తీరు ఎవని పేరు?
వయోజన విద్య అనగనే వచ్చి తీరు ఎవని పేరు?
గ్రామగ్రామమున వెలసెడి గ్రంథాలయమెవనికి గుడి?
అరగని తరగని వొడవని అక్షర దానంబెవనిది?
అరువదేండ్లు ప్రజల కొరకు అరిగిన కాయం బెవనిది?
తన బరువును మోయలేని తనువును చాలించెనెవడు?
తరతరాలు ఎవని మేలు తలచుచు పొరలుచు నుండును?
అందరికెవనితొ పొత్తు - అఖిలాంధ్రంబెవని సొత్తు?
ఏస్థాన కవిని నేనో, ఆ స్థానాధీశుడెవడు?
వయోవృద్ధుడగు యువకుడు, వాస్తవ జీవితమతనిది
హరిసర్వోత్తముడాతడు, ఆంధ్రులపాలిటి దేవుడు..

ఆంధ్రులలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుపొందిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సంపాదకులుగా, సాహితీకారుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా ఆయన తెలుగు జాతికి బహుముఖ సేవలు అందించారు. ఆంగ్ల పదం ఎడిటర్ కు సంపాదకుడు అనే తెలుగు పదాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి.ఎం.ఏ డిగ్రీ పొందిన ఆంధ్రులలో ఆయన రెండవ వారు.

1883 సెప్టెంబర్ 14 న కర్నూలులో భాగీరథీ బాయి, వెంకటరావు దంపతులకు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జన్మించారు . వారి పూర్వీకులు కడప జిల్లా, సింహాద్రిపురం గ్రామానికి చెందినవారు. వారిది పేద కుటుంబం. కర్నూలు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక, ఉన్నత విద్య చదివారు. ఇంకా చదువుకునే ఆర్థికస్తోమత లేకున్నప్పటికీ, ప్రతిభా పారితోషికాల సహాయంతో 1906లో మద్రాసు లో ఎం.ఏ డిగ్రీ పూర్తి చేసారు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతుండగా,1907లో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారు. రాజమండ్రిలో బిపిన్ చంద్ర పాల్ చేసిన ఉపన్యాస స్ఫూర్తితో విద్యార్థులంతా వందేమాతరం బ్యాడ్జిలు ధరించి తరగతికి వెళ్ళారు. వారికి నాయకుడైన సర్వోత్తమ రావును కళాశాల నుండి బహిష్కరించడమే కాక, ఆయనకు ఎక్కడా ఉద్యోగమివ్వ రాదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

తరువాత ఆయన పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. స్వరాజ్య అనే తెలుగు పత్రికను ప్రారంభించి, బ్రిటిష పాలనపై విమర్శలు ప్రచురించేవారు. 1908లో తిరునెల్వేలిలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు మరణించినపుడు "క్రూరమైన విదేశీ పులి" అనే పేరుతో ఆయన రాసిన సంపాదకీయంపై ప్రభుత్వం కోపించి, ఆయనకు మూడేళ్ళ ఖైదు విధించింది. ఆ విధంగా ఆయన ఆంధ్రులలో ప్రప్రథమ రాజకీయ ఖైదీ అయ్యారు. వెల్లూరు జైలులో, బందిపోట్లు, గజదొంగలూ ఉండే గదిలో ఆయనను బంధించి, అమానుషంగా వ్యవహరించింది, బ్రిటిషు ప్రభుత్వం. జైలు నుండి విడుదల అయ్యాక కూడా ఆయనపై ప్రభుత్వ నిఘా ఉండేది. ప్రజలు ఆయనతో మాట్లాడటానికి కూడా భయపడేవారు.

1914లో బాల గంగాధర తిలక్ యొక్క హోం రూల్ లీగ్కు ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా విస్తృతంగా ప్రచారం చేసారు. 1924లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభల సమయంలో హిందూస్థానీ సేవా దళ్ ఏర్పాటులో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. 1927లో కాంగ్రెసు అభ్యర్థిగా నంద్యాల నియోజక వర్గం నుండి మద్రాసు కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా కూడా పనిచేసారు. 1930 నుండి రాజకీయ కార్యక్రమాలు తగ్గించుకుంటూ, తనకెంతో ప్రీతిపాత్రమైన గ్రంథాలయోద్యమం వైపు దృష్టి మరల్చారు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థకు 1934 నుండి జీవితాంతం అధ్యక్షులుగా ఉన్నారు. గ్రంథాలయ కార్యకర్తలకు, వయోజన విద్యా ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించారు, శిక్షణా శిబిరాలు నిర్వహించారు.

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1952లో జరిగిన అఖిలపక్ష సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. దాని తరపున రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేసారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రమే కాక, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కూడా చూసి, 1960 ఫిబ్రవరి 29 న గాడిచర్ల హరి.సర్వోత్తమ రావు మరణించారు. ఆయన స్మారకార్ధం విజయవాడలో సర్వోత్తమ భవనం వెలసింది.

పత్రికా రచయితగా, సంపాదకులుగా, పుస్తక రచయితగా ఆయన చేసిన కృషి బృహత్తర మైనది. తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, మరాఠీ మొదలైన భాషలు కూడా ఆయనకు వచ్చేవి. ఎం.ఏ చదివే రోజుల్లోనే మొదలైన ఆయన సాహితీ వ్యాసంగం, జీవితాంతం కొనసాగింది. ఎన్నో కొత్త పదాలు సృష్టించారు.

ప్రముఖ దినపత్రిక ఆంధ్ర పత్రికకు ఆయన తొలి సంపాదకులుగా, 1916 నుండి 1918 వరకు సంపాదకుడుగా ఉన్నారు.ది నేషనలిస్ట్, మాతృసేవ, ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, కౌముది, ఆంధ్రవార్త అనే పత్రికలకు కూడా సంపాదకత్వం నిర్వహించారు. మహిళల సమస్యలు పరిష్కరం కోసం " సౌందర్యవల్లి " అనే పత్రిక నడిపారు. మద్రాసు గ్రామ పంచాయితీ అనే పత్రిక యొక్క తెలుగు, తమిళ, ఇంగ్లీషు ప్రతులకు సంపాదకుడిగా ఉన్నారు. సంపాదకుడు, భావకవిత్వం అనే పదాలను పరిచయం చేసింది కూడా ఆయనే. జి.హెచ్.ఎస్ పేరుతో హిందూ పత్రికకు వ్యాసాలు రాసారు. స్పిరిట్యువల్ స్వదేశీ నేషనలిజం అనే పుస్తకం రాసారు. ఆయన రాసిన శ్రీరామ చరిత్ర అనే పుస్తకాన్ని 11 వ తరగతికి ఉపవాచకంగా ప్రభుత్వం తీసుకున్నది. ఆయన రచించిన పౌరవిద్య అనే పుస్తకాన్ని మద్రాసు ప్రభుత్వం 1 నుండి 6 తరగతుల వరకు పాఠ్య పుస్తకంగా నిర్ణయించింది. వయోజన విద్య అనే తెలుగు పుస్తకాన్ని రచించారు. ఆయన వ్రాసిన అబ్రహాము లింకను చరిత్ర (1907) అనే పుస్తకాన్ని కొమర్రాజు వెంకటలక్ష్మణరావు సంకలించి విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో భాగంగా ప్రచురించారు.రాయలసీమకు ఆపేరు పెట్టింది ఆయనే. 1928లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో రాయలసీమ పేరును గాడిచర్ల, చిలుకూరు నారాయణ రావు చేసిన సూచనతో ఏకీభవించి ఆ పేరు పెట్టారు. అప్పటి వరకు దత్తమండలం అని పిలిచేవారు.నిస్వార్థ ప్రజాసేవకుడు, నిష్కళంక దేశభక్తుడుగా గాడిచర్ల హరిసర్వోత్తమ రావును చెప్పవచ్చు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# జాతీయ సమైక్యతా చిహ్నం హిందీ

**భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి..ఏకతాటిపై నడిపిన భాష**




> “ ఏ భాష మనుగడలో వుండాలన్నా, దాని ప్రయోగం, వాడకం అత్యంత ఆవశ్యకం. అప్పుడే భాష ప్రకాశిస్తుంది. భారతదేశం విభిన్న భాషలు మాట్లాడేవారికి నిలయం. కానీ మన దేశంలో ఎక్కువ మంది మాట్లాడుతున్న భాష హిందీ. తెలుగు, కన్నడ, మరాఠీ, గుజరాత్ వంటి ఎన్నో ప్రాంతీయ భాషలున్నాయి. ప్రతి దేశానికి అంతటికీ ఒక జాతీయ భాష అవసరం వుంటుంది. ప్రపంచం మొత్తంలో కేవలం మన దేశం మాత్రమే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తన భాషను కాదని పరాయి భాషలో పాలన చేస్తున్నది. అందుకే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత రాజ్యాంగం దీన్ని గురించి చర్చించి మన దేశానికి జాతీయ భాషగా ‘హిందీ’ని గుర్తించింది.

### నేడు హిందీ దివస్

భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏక తాటిపై నడిపి, హిందీ భాష ఆనాడు దోహద పడిందనే భావనతో గాంధీజీ స్ఫూర్తితో, 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగం లోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా గుర్తిస్తూ పొందు పరిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా నుండి ఈ తేదీని "హిందీ దివస్" (రాష్ట్ర భాషా దినోత్సవం) గా జరుపు కోవడం ఆనవాయితీ. ప్రశంసలు పొందిన భారతీయ పండితుడు, చరిత్ర కారుడు, వేదాంతవేత్త, సాహితీ వేత్త, హిందీ పండితుడు, సర్వోదయ కార్యకర్త, గాంధేయ వాది, పాత్రికేయుడు, రాజకీయ నాయకుడు, సంస్కృత భాషపై సాధికారికత కలిగిన, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన బీయాహర్ రాజేంద్ర సింహ్, 1949 సెప్టెంబర్ 14 న తన 50 వ పుట్టిన రోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బియాహర్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త్ మరియు సేథ్ గోవింద్ దాస్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ భారత రాజ్యాంగ సభ భారతదేశ రిపబ్లిక్ యొక్క రెండు అధికారిక భాషలలో దేవనాగరి లిపిలో వ్రాయబడిన ఒకటిగా హిందీని రాజ్యాంగ సభ ఆమోదంతో స్వీకరించింది. 1949 సెప్టెంబరు 14వ తేదీన హిందీని జాతీయ భాషగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా, ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారత దేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించ బడతాయి: హిందీ, ఇంగ్లీష్. అధికారిక భాష హిందీ దేవనాగరిక లిపి నుంచి రూపొందించ బడింది. ఈ భాష ఇండో యూరోపియన్ భాష సంతతికి సంబంధించిన ఇండో-ఆర్యన్ శాఖకు చెందినది. హిందీ అంటే "పర్షియన్ కానుక" అని అర్థం. హిందీ" మరియు "హిందూ" అనే పదాలు పాత పర్షియన్ కు చెందినవి, ఇవి "సింధు నది"ని సూచించే సంస్కృత పేరు సింధు నుండి వచ్చాయి. దీని అర్థం "హింద్ (భారత దేశం) యొక్క లేదా చెందినది". హిందీ భాష చాలా వరకూ సంస్కృతం నుంచి గ్రహించ బడినది. అయితే కాలక్రమంలో ఉత్తర భారతదేశం లోని ముస్లిం ప్రభావం వల్ల పర్షియన్, అరబిక్, టర్కిష్ పదాలు హిందీలో చేరి ఉర్దూ భాష ఆవిర్భవించింది. మనం శుద్ధ హిందీ(ప్యూర్ హిందీ) భాషను రేడియోలలో, టి.వి. వార్తలలో వినవచ్చు. ప్రస్తుతం చలామణిలో ఉన్న హిందీ భాష చాలా వరకూ సులభతరం చేయ బడింది. ఉత్తర భారత దేశంలో ఇస్లామిక్ పరిపాలన వచ్చిన తరువాత, పాత హిందీ పెర్షియన్, అరబిక్ నుండి అనేక రుణ పదాలను సంపాదిం చింది. ఇది హిందూస్థానీ అభివృద్ధికి దారి తీసింది. అవధి మరియు బ్రజ్ భాష వంటి సాహిత్య ప్రామాణీ కరణ ద్వారా హిందీ బెల్ట్ యొక్క వివిధ మాండలికాలు మరియు భాషలు ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి. మొఘల్ కాలం (1800 లు) చివరి భాగంలో భాషా ప్రతిష్టను పొందింది. ఆధునిక హిందీ మరియు దాని సాహిత్య సంప్రదాయం 18 వ శతాబ్దం చివరిలో ఉద్భవించింది. ముందుగా దీనిని ఉత్తర భారత దేశం యొక్క భాషగా (ప్రస్తుత పాకిస్తాన్ తో సహా ) బ్రిటిష్ వలస వాదులు మరియు స్వదేశీ ప్రజలు స్వీకరించారు. 19 వ శతాబ్దం చివరలో, ఉర్దూ నుండి వేరుగా ఉన్న హిందూస్థానీ యొక్క ప్రామాణిక రూపంగా హిందీని మరింత అభివృద్ధి చేసే ఉద్యమం ఏర్పడింది. జాతిపిత మహాత్మా గాంధీ కూడా దేశంలో ఐక్యతను తీసుకు రావడానికి ఈ భాషనే వాడేవారు. ఈ భాషను "లాంగ్వేజ్ ఆఫ్ యూనిటి" అనేవారు. 9 రాష్ట్రాల్లో మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాలలో అధికార భాష కాగా, 3 రాష్ట్రాల అదనపు అధికార భాష.

బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ (అదనపు), హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం (అదనపు), రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ (బ్లాక్స్, డివిజన్లు లేదా 10 శాతం కంటే ఎక్కువ జనాభా ఉన్న జిల్లాల్లో) అండమాన్ మరియు నికోబార్ దీవులు, దాద్రా మరియు నగర్ హవేలి, డామన్ దయ్యూ, ఢిల్లీలలో రాజ్య మేలుతోంది.1954 లో, భారత ప్రభుత్వం హిందీ వ్యాకరణాన్ని సిద్ధం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది; కమిటీ నివేదిక 1958 లో "ఎ బేసిక్ గ్రామర్ ఆఫ్ మోడరన్ హిందీ"గా విడుదలైంది. రాతలో ఏక రూపతను తీసుకు రావడానికి, కొన్ని దేవనాగరి అక్షరాల ఆకారాన్ని మెరుగు పరచడానికి మరియు ఇతర భాషల నుండి శబ్దాలను వ్యక్తీకరించడానికి కృషి జరిగింది. ఇతరులు అర్థం చేసు కోవడాన్ని సులభమైన బాష హిందీ ఒక్కటేనని గుర్తు చేశారు. ప్రపంచం లోని చాలా దేశాలలో హిందీ భాషను మాట్లాడుతారు. భారత దేశం వెలుపల, హిందీ మాట్లాడేవారు నేపాల్ లో 8 మిలియన్లు, యూ.ఎస్.ఏ లో 8,63,077, మారిషస్ లో 4,50,170; ఫిజీలో 3,80,000; దక్షిణాఫ్రికాలో 2,50,292; సురినామ్‌లో 1,50,000; ఉగాండాలో 1,00,000; యునైటెడ్ కింగ్‌డమ్‌లో 45,800; న్యూజిలాండ్‌లో 20వేలు, జర్మనీలో 20వేలు, ట్రినిడాడ్ మరియు టొబాగోలో 26వేలు, సింగపూర్‌లో 3 వేలు, మారిషస్, ట్రినిడాడ్, అమెరికా, దక్షిణాఫ్రికా, న్యూజి ల్యాండ్ వంటి చాలా దేశాలలో ఇప్పటికీ హిందీ ముఖ్య భాషగా ఉంది. ఆసియా వెలుపల , భోజ్‌పురి , బిహారీ భాషలు , ఫిజియన్ మరియు ఇంగ్లీష్ ప్రభావంతో అవధి భాష (తూర్పు హిందీ మాండలికం) ఫిజీలో మాట్లాడ బడుతోంది. ఇది ఫిజీలో 1997 రాజ్యాంగం ప్రకాలరం "హిందుస్తానీ" గా పిలువబడే అధికారిక భాష. అయితే 2013 ఫిజి రాజ్యాంగంలో దీనిని " ఫిజి హిందీ " అని పిలుస్తారు. ఫిజీలో 3.8 లక్షల మంది మాట్లాడు తున్నారు. 2011 నేపాల్ జనాభా లెక్కల ప్రకారం నేపాల్‌లో సుమారు 77,569 మంది హిందీని మొదటి భాషగా, ఇంకా 1,225,950 మంది రెండవ భాషగా మాట్లాడతారు.

దక్షిణాఫ్రికాలో రక్షిత భాషగా, రాజ్యాంగం ప్రకారం,దక్షిణాఫ్రికా భాషా బోర్డు ఇతర భాషలతో పాటు హిందీ పట్ల గౌరవాన్ని ప్రోత్సహిస్తున్నది. ఉర్దూ మాట్లాడే చాలా మంది పాకిస్తానీయులకు హిందీ అర్థం చేసుకోవడం చాలా సులభం. ఇది హిందీ మాదిరిగానే హిందూస్థానీ భాష యొక్క ప్రామాణిక రిజిస్టర్; ఆధునిక హిందీ నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలకు మొదటి భాషగా, 1.8 బిలియన్ల ప్రజలు మాట్లాడే భాషగా ఉంది. అంటే దేశంలో 1/8 వ ప్రజలు ఉపయోగించే భాషగా, దేశాన్ని ఏకం చేసే భాషగా హిందీ గుర్తించ బడుతోంది. జాతీయ భాషగా వర్ధిల్లుతోంది. హిందీ నేర్చు కోవడానికి చాలామంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్టికల్ 351 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమకు నచ్చిన భాషలో పని చేయడానికి స్వేచ్ఛను కలిగి ఉన్నాయి. స్థానికేతర హిందీ మాట్లాడే వారిపై బలవంతపు రుద్దడానికి విస్తృతమైన ప్రతిఘటన, ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో (తమిళనాడు వంటివి) 1963 అధికారిక భాషల చట్టం ఆమోదించడానికి దారితీసింది. ప్రపంచం లోనే ఎక్కువగా మాట్లాడే భాషలలో ఒకటిగా హిందీ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉండడం గమనార్హం. అయితే మాతృభాషపై ఉన్న మమకారముతో సంబంధిత రాష్ట్రములలో ప్రతివారికి విద్యా విధానాలు అందాలంటే తప్పని సరిగా మాతృభాష లోనే చదువు కోవాలి. విభిన్న భాషలు ఉన్న భారత దేశములో ఒకరి భావావేశాలు మరొకరు అర్థము చేసు కునేందుకు ఒక కనీస ఉమ్మడి భాష అవసరము ఎంతైనా ఉంది. ప్రపంచ దేశాల ప్రజలతో సంభాషించేందుకు ఇంగ్లీష్ కు ఉన్న ప్రాముఖ్యత మరియేఇతర భాషకు లేదు. ఇంగ్లీష్ నేర్చుకోవడం తప్పనిసరి అవుతున్నది. ఈ విధముగా హిందీయేతర ప్రాంతాలలో మూడు భాషలు నేర్చుకోవడం కష్టతరము, ఇబ్బందులకు హేతువు అవుతుంది. కనుక హిందీని అనవసరముగా నేర్చుకోమని బలవంత పెట్టకూడ దనేది విద్యావేత్తల అభిప్రాయం. నరేంద్ర మోడీ ప్రభుత్వం అందుకే ప్రాథమిక దశలో విద్యార్థులకు మాతృ భాషలో విద్య నేర్చుకునే విషయంపై ప్రధానంగా దృష్టి నిలిపింది.

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

- ఉత్తమ్ కమిటిని ఉపసంహరించుకోవాలి
- కమిటిలో మాల మంత్రి ఎందుకు లేడు
- మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగింది
- సిట్టింగ్ న్యాయమూర్తితో కమిషన్ వేయాలి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉప సంహరించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటి వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అని సమితి భావిస్తోంది. ఇది ఏకపక్షంగా ఉన్న ఈ మంత్రుల కమిటితో తెలంగాణ లోఉన్న 50 లక్షల మంది మాల, మాల ఉప కులాలకు ఏమాత్రం న్యాయం జరగదు. ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటిని ఎలా నియ మీస్తారని అన్నారు. మంత్రుల కమిటీ లోనే మాలలకు అన్యాయం జరిగింది అని మంత్రుల కమిటీలో మాల మంత్రి ఎందుకు లేరని ప్రశ్నించారు. అసలు మాల మంత్రి భాగస్వామ్యం లేని ఈ కమిటిని మేము స్వాగతించడం లేదు. ప్రభుత్వం ఏకపక్షంగా వర్గీకరణ అమలు చేయాలనుకున్నప్పుడు మంత్రుల కమిటీ ఎందుకు? ఇదంతా మాలలను, మాల ఉప కులాలను మోసం చేయడానికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కమిటి స్థానంలో సిట్టింగ్ న్యాయమూర్తి తో కమిషన్ వేయాలని డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని , రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు.

## కార్పొరేషన్ చైర్మన్ రామ్ రెడ్డి ప్రత్యేక పూజలు



**విశ్వంభరా, చైతన్యపురి:** గడ్డి అన్నారం డివిజన్ వివి నగర్ లో వివేకానంద నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ సునీల్ బాబు వారికి శాలువా కప్పి సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దుల వెంకటేష్ యాదవ్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు పన్యాల జైపాల్‌రెడ్డి, ఈపూరి బద్రినాథ్, తోకటి కిరణ్, గణేష్, యుగంధర్ పాల్గొన్నారు.

## ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



**విశ్వంభర,ఎల్బీనగర్:** ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి అని వాసవి కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మహా గణపతి 37వ నవరాత్రి మహోత్సవాల లో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రంగారెడ్డి జిల్లా కోర్ట్ న్యాయ మూర్తులు నిష్కా పత్రుడు, పెనుమల గోపిక నాగ శ్రావ్య, సరూర్నగర్ సర్కిల్ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ మాధవ రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్ గుప్తా, దేవాలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, బంధం దామోదర్, గౌరిశెట్టి అరుణ్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంధి రమేష్, గందే శ్రీకాంత్, డా!!. రాంకిషన్, శుభకర్, కృష్ణ మూర్తి, లక్ష్మయ్య, సుబ్బారావు, మేఘమాల, సుజాత, లక్ష్మీ, భ్రమరాంబా, లావణ్య, అరుణ, వనజ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హౌజ్ అరెస్ట్

*శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుల ముందస్తు చర్యలు*



**విశ్వంభర,షాద్ నగర్:** షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ను కేశంపేట పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య చిలరేగిన వివాదం నేపథ్యంలో నేడు గాంధీ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ స్వగ్రామమైన కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేట గ్రామములో పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కల్పించకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిన్న రాత్రి కేశంపేట పోలీస్ స్టేషన్ ముందు హరీష్ రావు తదితర నేతల నిర్బంధం సందర్భంగా చెల్లరేగిన ఉద్రిక్తత వాతావరణం నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కేశంపేట పోలీస్ స్టేషన్ ముందు చేసిన ఆందోళన, ధర్నాల నేపథ్యంలో నియోజకవర్గంలో ముఖ్యమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.

## సీతారాం ఏచూరి ఆయన వ్యక్తి కాదు ఒక శక్తి



**విశ్వంభర, మిర్యాలగూడ:** సీతారాం ఏచూరి అకాల మంరణం పట్ల సీపీఎం పార్టీ నాయకులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి ఆయన వ్యక్తి కాదు ఒక శక్తి గా భారతదేశ రాజకీయాలలో ఒక ముక్యమైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన విద్యార్థి దశ నుండే ఎత్తి జెండా దించకుండా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, ఎన్నో ఇబ్బందుల కోర్చి పార్టీ కోసం పని చేసిన నాయకుడు, గొప్ప మేధావి, మార్క్సిస్టు సిద్ధాంత కర్త అని జూలకంటి రంగారెడ్డి అన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులను కూడకట్టే విషయంలో భారతదేశ రాజకీయాలలో ఆయనకు మించిన నాయకుడు లేడని కొనియాడారు. మన దేశంలోనే కాకా ప్రపంచంలోనే కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో తోడ్పాటు నందించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని ఆన్నారు. అట్లాంటి వ్యక్తి మన మధ్య లేక పోవడం, మార్క్సిస్టు ఉద్యమానికి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విచారం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ముందస్తు అరెస్టు



**షాద్ నగర్, విశ్వంభర:** ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డిల మధ్య నెలకొన్న రాజకీయ యుద్ధం నేపథ్యంలో శుక్రవారం చలోఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసానికి బీఆర్ఎస్ పిలుపిచ్చింది. ఇందులో భాగంగానే శుక్రవారం బీఆర్ఎస్ షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌ను ఆయన నివాసం వద్ద పట్టణ సీఐ విజయ కుమార్ ముందస్తుగా అరెస్ట్ చేశారు. అలాగే షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్ తన నివాసం వద్ద పట్టణ ఎస్ఐ బలరాం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## క్యూఆర్ కోడ్ ద్వారా వరద బాధితులు ఆదుకోండి




**విశ్వంభర, మహబూబాబాద్:** వరద బాధితులను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, ఇతర రంగాల్లోని ప్రముఖులు స్పందించాలని కోరారు. "వరద బాధితులను ఆదుకోవడానికి చేతసనంత సహాయాన్ని అందించండి. మానవత్వం ప్రదర్శించాల్సిన సమయమిది" అని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు ఆన్ లైన్ బ్యాంకింగ్ ద్వారా గానీ, చెక్కులు, డీడీల రూపంలోగానీ లేదంటే యూపీఐ పేమెంట్ యాప్స్ నుంచి ఈ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసిగానీ పంపవచ్చు అని తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ఆర్ కింద విరాళాలు అందించే సంస్థలు కింద ఇచ్చిన రెండో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరపవచ్చు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హౌజ్ అరెస్ట్



విశ్వంభర, షాద్ నగర్: మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డిని పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరో ఎమ్మెల్యే అరికపూడి గాంధీల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని శాంతి భద్రతల చర్యల నేపథ్యంలో ముందస్తు అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర,ఎల్బీనగర్:** దేశ వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న రాజీ చేయగలిగిన కేసుల పరిష్కారం కోసం ఈనెల 14 తేదీన ( శనివారం) జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయవాది, టిపిసిసి స్టేట్ లీగల్ సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్ టిఐ విభాగం స్టేట్ కన్వీనర్ నూనె ప్రభాకర్ లు కోరారు. టిపిసిసి లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టిఐ విభాగం స్టేట్ కన్వీనర్ గా నూనె ప్రభాకర్ ఎన్నికైన సందర్భంగా ఆయనను ఆర్‌టిఐ యాక్ట్-2005 తెలంగాణ స్టేట్ బెస్ట్ ప్రాక్టీషనర్ అన్నె బోయిన మట్టయ్య, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు గుంట ప్రేమ్ కుమార్, హైకోర్టు న్యాయవాదులు మన్నెం మల్లయ్య, డి.రాములు, ఎస్. నాగేశ్వరరావు, బి.లక్ష్మయ్య, చల్లా రామ్ కళ్యాణ్ లు కలిసి హైకోర్టు ప్రాంగణంలో నూనె ప్రభాకర్ కు బొకే అందజేసి, శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం హైకోర్టు న్యాయవాదులు పొన్నం అశోక్ గౌడ్, నూనె ప్రభాకర్ లు విలేఖరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయ సేవల అధికారాల చట్టం-1987 ననుసరించి జాతీయ న్యాయ సేవల అథారిటీ ఆధ్వర్యంలో వివిధ కోర్టులు, ట్రిబ్యునల్స్‌లో జాతీయ లోక్ అదాలత్ లు నిర్వహించడం జరుగుతుందని, లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతీ సంవత్సరంలో 4సార్లు జాతీయలోక్ అదాలత్‌లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గత మూడేళ్లలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ వలన 13కోట్ల 57లక్షలకు పైగా కేసులు పరిష్కారమవడంతోపాటు మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సీతారాం ఏచూరికి నివాళులు



**విశ్వంభర,చైతన్యపురి:** రంగారెడ్డి జిల్లా సరూర్నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో బోడిపూడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రం దిల్సుఖ్నగర్‌లో ఆల్ ఇండియా సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించిన రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, సర్కిల్ కమిటీ కార్యదర్శి సిహెచ్ వెంకన్న. వారు మాట్లాడుతూ సీతారం ఏచూరి లేని లోటు పుడ్చ లేమని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, క్షార వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మల్లేష్, సిఐటియు కార్యదర్శి మల్లెపాక వీరయ్య, రజక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సిమల్లేష్, కల్లిగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గాజుల అంజయ్య, కెవిపిఎస్ సర్కిల్ కార్యదర్శి ఎంకృష్ణ లతీఫ్ పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డి గృహ నిర్బంధం అక్రమం



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ను శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో గృహనిర్బంధం చేయడం అక్రమమని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ ఇంట్లో బిఆర్ఎస్ పార్టీ సమావేశం పిలుపులో ముందస్తుగా గృహని ర్బంధం చేయడం తగదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తానని చెప్పి, ఫ్యాక్షనిస్టు రాజకీ యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడిపిస్తున్నాడని అన్నారు. దొంగేదొంగ అన్నట్లుగా, బిఆర్ఎ స్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్‌చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనంఅన్నారు. పాలనపై పట్టు లేకనే తుగ్లక్‌పనులు చేస్తున్నాడని అన్నాడు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అరకపుడి గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను విడుదల చేయాలని అన్నారు.

## రేవంత్ రెడ్డిది అరాచక గుండా పాలన



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తామని ప్రగల్బాలు పలికి అధికారంలో వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలొ అరాచక పాలనను కొనసాగిస్తుందని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షు లు చీరాల రమేష్, కాట్రోత్ బహదూర్‌లు విమర్శించారు. శుక్రవారం వారిని ముందస్తుగా అరెస్టు చేసి మంచాల పోలీస్ స్టేషన్ తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటిపై మరో ఎమ్మెల్యే దాడి చేయడం ఇంతవరకు జరగని పరిణామాలు అన్నారు. గత పది సంవత్సరాలు ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని విచ్చినం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుంది అని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలన దృష్టి పెట్టాలని అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు, పాడి కౌశిక్ రెడ్డిలను అరెస్టు చేయటం సిగ్గుచేటని అన్నారు, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పాడి కౌశిక్ రెడ్డీపై చేయించిన హత్య యత్నం అని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలాంటి దాడులు ఆపాక పోతే గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వం అన్నారు. పిఎసిఎస్ మాజీ చైర్మన్ బస్సు పుల్ల రెడ్డి, మంచాల గ్రామమాజీ సర్పంచ్ జగన్‌గారు, పార్టీ యువజన రాష్ట్రనాయకులు నూతనగంటి శేఖర్, ఇబ్ర హీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జంబూల కిషన్ రెడ్డి, యండి జానీపాష, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షులు వనపర్తి బద్రీనాథ్ గుప్త, జాటోత్ లచ్చిరాం, ఆకారం కృష్ణ వున్నారు.

## బీఆర్ఎస్ మండల నాయకుల అక్రమ అరెస్టులు



**విశ్వంభర, రామన్నపేట:** బీఆర్ఎస్ మండల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ మండల నాయకులు రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి తీవ్రంగా ఖండించారు. పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపైన దాడి చేసిన అరికెపూడి గాంధీని, అతని అనుచరులను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి మరణం దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని ఆత్మకూరు(ఎం)మండల సీపీఎం కార్యదర్శి వేముల బిక్షం అన్నారు. మండల కేంద్రంలోని కూరెళ్ళ, పల్లెర్ల గ్రామాలలో సీతా రాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం సీపీఎం ఉద్యమానికే కాకుండా దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని అన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేసిన గొప్పల నాయకుడని అన్నారు. గత 40 సంవత్సరాల నుండి దేశ రాజకీయాల్లో విద్యార్థి ఉద్యమాల నుండి మొదలుకొని యువజన, కార్మిక ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని దేశం ఒక సామాజిక వేత్తను కోల్పోయిందని అన్నారు. రాజ్యసభ సభ్యులుగా దేశవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడి కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని మెడలు వంచడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకున్ని కోల్పోవడం ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని ఆయన ఆశయ మార్గంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అప్పుడే ఆయన ఆశయాలను సాధించిన వారమవుతామని అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, మండల కమిటీ సభ్యులు రచ్చ గోవర్ధన్ నేత, చెరుకు మల్లేశం గౌడ్, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, కూరెళ్ళ గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, పల్లెర్ల గ్రామ శాఖ కార్యదర్శి గుండబోయిన స్వామి, వి గోపాల్ రెడ్డి, భాష బోయిన రాములు, బండ బీరయ్య, భాష బోయిన ఉప్పలయ్య, ఉప్పల నరసింహ, మరి పెల్లి మల్లయ్య, భాషబోయిన సత్యనారాయణ, విద్యాసాగర్ రెడ్డి, మొరిగాని శీను, కూరెళ్ళ రమేష్, కందుల



సంతోష్,నాయిని రామ్ రెడ్డి, నాయిని యాదిరెడ్డి, నాయిని కృష్ణారెడ్డి, మర్రి పెల్లి రాములు, స్వామి, సామనర్సిరెడ్డి, తుర్కపల్లి మల్లేశం, అంజయ్య, ఎలిమినేటి మాస్, అండాలు, స్వామి ు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం

### *కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ బురద జల్లే కార్యక్రమం ఆపండి: కె.ఎల్.ఆర్*



**విశ్వంభర, మహేశ్వరం:** హైదరాబాద్ మహానగరం తోపాటు తెలంగాణ నలుదిక్కులు అభివృద్ధి చెందేలా త్రిబుల్ ఆర్ ఫోర్త్ సిటీ, విద్య-వైద్య రంగాలు లాంటి అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారని మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని కేఎల్ఆర్ మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని బీఆర్ఎస్ నాయకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు చేసుకుని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే కుట్రలు చేస్తున్నారని వాటిని ఏమాత్రం సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ సహించబోదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలాగా నిర్బంధాలు చేస్తే ప్రతిపక్ష నాయకులు రోడ్లపై తిరగలేరని కాంగ్రెస్ నేత గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై విలువైన సూచనలు ఇస్తే అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబితే ఇంత వరకు ఫామ్ హౌస్ నుంచి కేసీఆర్ బయటకు రాలేదన్నారు. కేఎల్ ఆర్. ఫామ్ హౌస్ ఆదేశాలకు బీఆర్ఎస్ కార్యకర్తలు బలికావొద్దన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఆటకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న హెచ్చరించారు.

## ఏచూరికి నివాళులర్పించిన సీపీఎం నాయకులు



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఒక్క నిమిషం మౌనం పాటించి సీతారాం ఏచూరి మరణానికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యురాలు జి. కవిత, జిల్లా కమిటీ లసభ్యులు అలువాల రవికుమార్, కార్మిక నాయకులు స్వర్ణగంటి చంద్రయ్య, కటికల శంకర్, పేయ్యల రవి, గద్దగూటి రాములు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని కక్కిరేణి, ఇస్కిల గ్రామాలలో ప్రతిష్టాపన చేసిన గణపతి విగ్రహాల వద్ద నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాకూబ్ నాయక్, ఏపీవో వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాఠశాలలో డబుల్ బెంచీల ఏర్పాటుకు ఆర్థిక సాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మరియు ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు కూర్చోవడానికి డబల్ బెంచీలకు ఆర్థిక సాయంగా సూరిశెట్టి బాలమ్మ సిమ్మయ్య కుమారులు శ్రీనివాసులు గుప్త, సురేష్ గుప్తా, శశి గుప్త లు 50 వేల రూపాయలు, ముత్యాల మాణిక్య రెడ్డి 10 వేల రూపాయలు ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య కు అందజేశారు. ఈ సందర్భంగాగట్టు ఇప్పలపల్లి గ్రామ ప్రజలందరి తరఫున వారికి ధన్యవాదలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గట్టు ఇప్పలపల్లి మాజీ సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య, కాంగ్రెస్ మండల నాయకులు గాదె రేణు రెడ్డి, వీరన్న పల్లి సర్పంచ్ నాగమణి లింగం గౌడ్, మల్లెపల్లి చెన్నా రెడ్డి, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత శాంతి సంఘీభావ సంఘంనివాళి




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ఆఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సిపిఐ(ఎం)జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సమావేశం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు జి.రఘుపాల్ అధ్యక్షతన జరిగింది. ఐప్సా జాతీయ నాయకులు, మాజీ ఎంఎల్ కె.యాదవరెడ్డి, మైనార్టీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర సమన్వమ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.రామ రాజు, కార్యదర్శి జె.కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, వినోద్, రామచంద్రారెడ్డి, పిఎన్ మూర్తి, సూర్యప్రకాశ్ తదితరులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ శాంతికి విశేష కృషి చేసిన సీతారాం ఏచూరి మరణం శాంతి ఉద్యమాలకే కాకుండా పేద ప్రజలు, వామపక్షవాదులకు తీరని లోటన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఓబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ప్రపంచంలోని సమాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై పూర్తి అవగాహన కలిగిన గొప్ప మేధావి సీతారాం ఏచూరి అని కొనియాడారు. సమాజ శాంతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి భౌతికంగా దూరం కావడం చాలా విచారకరమని కెవిఎల్ అన్నారు. అగస్టు 17న ప్రపంచ శాంతి ఉద్యమ యోధులు రమేశ్ చంద్ర పీస్ అవార్డును అందుకున్న సీతారాం ఏచూరి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులతో పాటు ప్రపంచ శాంతి ప్రాధాన్యతకు సంబంధించిచేసిన ప్రసంగం చివరిది అవుతుందని ఎవరూ ఊహించలేదన్నారు.నమ్మినసిద్దాంత కోసంతుదిశ్వాసవరకు పనిచేసిన లోటు ఎవరూ తీర్చలేనిదని కొనియాడారు.

## సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం

### *పోస్టర్లను ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ కె. శశాంక*



**విశ్వంభర, రంగారెడ్డి:** అక్టోబర్ నెలలో జరిగే సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవ మరియు అవగాహన సదస్సు పోస్టర్లను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ కె.శశాంక శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రతి పౌరునికి భారత్ వంటి అనేక ప్రజాస్వామ్య దేశాలలో సమాచార హక్కు ప్రాథమిక హక్కులలో భాగంగా అత్యంత విలువైన మానవ హక్కుగా గుర్తించారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పథకాల గురించి అవగాహన పెంచుకోవడానికి కూడా సమాచార హక్కు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని శక్తివంతమైన సాధనంగా ఉపయోగించాలని అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విద్యా అధికారులు, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, మైనింగ్ అధికారులు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడి ఉద్యోగులు, అన్ని శాఖల అధికారుల సమక్షంలో విద్యార్థులకు, యువకులకు సమాజంలో సమాచార హక్కు చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏ ఏ కార్యక్రమాలు ప్రజలకు అవసరం పడతాయని అవగాహన సదస్సును ఏర్పాటు చేయుటకు జాతీయ, రాష్ట్ర కమిటీ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, ఆర్టీఐ రంగారెడ్డి జిల్లా సభ్యులు రామగళ్ళ శ్రీనివాస్, దొడ్డి రాజు యాదవ్, కాకి శేఖర్, ఉడుగుల మధు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**విశ్వంభర, చివ్వేంల:** విఘ్నాలు తొలగించే వినాయకుడు ప్రజలందరికీ సుఖ సంతోషాలతో పాటు అనుకున్న లక్ష్యాలను చేరుకునేలా కరుణించాలని బీఆర్ఎస్ మండలపార్టీ ఉపాధ్యక్షులు రావిచెట్టు సత్యం అన్నారు. వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, గణనాధుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సీతారాం ఏచూరి ఘన నివాళి



**విశ్వంభర, షాద్ నగర్:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి షాద్ నగర్ సీపీఎం నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పట్టణం ముఖ్య కూడలిలో ఆయన పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు కుర్మయ్య లక్ష్మి చంద్రమౌళి, జనార్ధన్, ఈశ్వర్ నాయక్, కావాలి రాజు, మీది పేట రాజశేఖర్, శ్రీకాంత్, ముఖిత్, కృష్ణ, నర్సింలు,కృష్ణయ్య, బాలయ్య, వెంకటయ్య, భుజంగారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి



**విశ్వంభర, పరిగి:** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవి రావాలని శుక్రవారం ఓయూ జేఏసీ నేత పిహెచ్డి స్కాలర్ రామచంద్రయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు స్థానిక సరస్వతి మాత దేవాలయంలో 100 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య యాదవ్ మాట్లాడుతూ.. 2005- 06 సంవత్సరం నుండి కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరిగిందన్నారు. 2009 మలిదశ తెలంగాణ ఉద్యమంలో పరిగి ప్రాంతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని బలపరుస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పరిగి పట్టణంలో నిరాహార దీక్ష చేయడం జరిగిందన్నారు. 2014 సంవత్సరంలో పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రామ్మోహన్ రెడ్డి గెలిచి, కేసీఆర్ ప్రోత్సహించి పార్టీ ఫిరాయింపులకు పార్టీ మారకుండా పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకొని కాంగ్రెస్ పార్టీ కోసం అలుపెరగని పోరాటాన్ని కొనసాగించారు. విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, మన ప్రాంతాన్ని జోగులాంబ జోన్ నుండి చార్మినార్ జోన్ లో విలీనం చేయడానికి కృషి చేశారని, 2019 నుండి 2024 సంవత్సరం వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉండి వికారాబాద్ జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయడం జరిగిందన్నారు. మరింత విస్తృతంగా సేవ చేయడానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఓయూ జేఏసీ నాయకులు, విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థులు సుభాష్, యాదగిరి, మధు, సంతోష్, శ్వేత, పావని, తదితరులు పాల్గొన్నారు.

## భీమ్ శంకర్ పై దాడి చేయడం అమానుషం

**విశ్వంభర, బాన్సువాడ:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో వర్ని మండల కేంద్రంలో భీమ్ శంకర్ పై కొందరు దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ ఇంచార్జ్ రవీందర్‌రెడ్డి తెలిపారు. కొంతమంది మాదే రాజ్యమని కావాలని దాడి చేయడం, కార్యకర్తలను భయభ్రాంతులను చేయడం తగదని ఈ విషయాల న్నిటినీ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దగ్గరికి తీసుకెళ్తానని బీమా శంకర్‌కు న్యాయం చేస్తానని తెలిపారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలి



**విశ్వంభర,హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో వారు స్పీకర్‌ను కలిశారు. ఈసందర్భముగా వారు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడారని మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే చెప్పారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతున్నానంటూ కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు మహిళలను కించపరచడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్పర్సన్ బండు శోభారాణి, ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్పర్సన్ కల్వ సుజాత, కాంగ్రెస్ అదికార ప్రతినిది భవాని రెడ్డి, సంధ్యరెడ్డి, పారిజాతం రెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## అరెస్ట్ చేయడం నాటి సీమాంధ్ర పాలనను గుర్తుచేస్తుంది



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):**రాజకీయ విమర్శలే తప్ప రాజకీయ దాడుల సంస్కృతి లేని తెలంగాణాలో నేడు సాక్షాత్ మా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటి మీదకి రౌడీలను కాంగ్రెస్ కార్యకర్తల తీసుకొచ్చి కౌశిక్ రెడ్డి ఇంటిని రాళ్లతో ధ్వంసం చేయడమే కాక భౌతికదాడులకు పాల్పడటం పట్ల బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావు ఖండించి నిరసనకు పిలుపునిస్తే అక్కడికి వచ్చిన ఎమ్మెల్యేలను, నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేయడం నాటి సీమాంధ్ర నాయకుల పాలనను గుర్తుచేస్తుందని హరిష్ అన్న యువసేన నాయకులు కూరెళ్ళ మణికుమార్ అన్నారు. దాడులను ఆపాల్సిన పోలీస్‌లు రక్షణ కల్పించకపోవడం దాడి చేయడానికి వచ్చిన గూండాలకు మద్దతుగా ప్రేక్షకపాత్ర వహించడం అన్నీ గుర్తుపెట్టుకొని మళ్ళీ మా ప్రభుత్వం వచ్చాక వడ్డీతో సహ చెల్లిస్తాం అని హెచ్చరించారు. సీఎంకు పాలన చేతకాక పోలీస్ లతో ప్రశ్నించే నాయకుల మీద కేస్‌లు పెట్టిస్తున్నాడని రేవంత్ రెడ్డి తొందర్లోనే నీ సీఎం పదవిని నీ పార్టీని ప్రజలతో కలిసి బొందపెడతాం అని హరిష్ అన్న యువసేన నాయకులు కూరెళ్ళ మణికుమార్ అన్నారు.

# సీపీఐఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి సంతాపం

**విశ్వంభర,ఎల్బీనగర్:** సాగర్ రింగ్ రోడ్డు బస్టాండ్ వద్ద ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్ మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి చనిపోయే వరకు వామపక్ష భావాలతోనే నడిచారన్నారు. ప్రజా ఉద్యమాల్లో పార్లమెంటరీ ఉద్యమాల్లో ఆయన ఎప్పుడు ప్రజల పక్షమే వహించారన్నారు. కార్మిక కర్షక ఉద్యమాల వాణిని వినిపించి అనేకసార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారని తెలిపారు. పేద ప్రజల ఐక్యత కోసం కుల, మత వైషమ్యాలు లేని భారత సమాజం కోసం కృషి చేశారన్నారు. వారి మృతి కమ్యూనిస్టు పార్టీల అనుబంధ సంఘాలకు కార్మిక సంఘాలకు ప్రజానీకానికి తీరనిలోటు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేయడంలో సీతారాం ఏచూరి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని కట్టుబడి. ఎలాంటి ప్రభావాలకు లొంగకుండా ప్రజల కోసం లోక్‌సభలో నిత్యం ప్రజల పక్షాన ప్రజానాయకుడిగా మాట్లాడేవారన్నారు. నేపాల్ లో కమ్యూనిస్టు పార్టీ నక్సలైట్ల ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆయన విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం ఇంద్ర గాంధీ ప్రైడ్‌లో ఎమర్జెన్సీ పిలిపించిన అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు. అన్ని పార్టీలకు నచ్చిన నాయకుడు ప్రజల పక్షాన మాట్లాడే నాయకుడు సీతారాం ఏచూరి గారిని, వారి మరణం చాలా బాధాకరమని ఈ సందర్భంగా జోహార్లు అర్పిస్తూ సెల్యూట్ కామ్రేడ్ సీతారాం ఏచూరి అన్నారు.



ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షులు లాట్ల లక్ష్మణ్, హమాలీ కార్మికుల నాయకులు కృష్ణ, యాదయ్య, వెంకటయ్య, సుధాకర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు నల్ల వెంకటయ్య, శాంతి కుమారి పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని నడపలేరు



**విశ్వంభర, ఆమనగల్లు:** శాంతియుతంగా ఉన్న తెలంగాణలో అక్రమ అరెస్టులు చేస్తూ ప్రభుత్వాన్ని నడపలేరని జిల్లా సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఆమనగల్ మాజీ జెడ్పీటీసీ అనురాధ పత్యా నాయక్ అన్నారు. పాడి కౌశిక్ రెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ నేతలు తరలివెళ్తారని ముందస్తుగా ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీని, టీఆర్ఎస్ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ అనురాధ మాట్లాడుతూ ఆమనగల్లు మండల కేంద్రంలో తెలంగాణలో అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్న రేవంత్ రెడ్డి సర్కారు ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, రైతు బంధు రైతులకు ఇవ్వకుండా రుణమాఫీ పూర్తి చేయకుండా, మహాలక్ష్మి పేరుతో మహిళలకు 2500 కళ్యాణ లక్ష్మి షాది ముబారక్‌తో పాటు తులం బంగారం ఇవ్వకుండా, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, ప్రజలను తప్పుదారి పట్టిస్తూ పథకాలు అమలు చేయకుండా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ రాష్ట్రంలో రాజకీయంగా ప్రజల దృష్టిని మారాల్చే ప్రయత్నం చేస్తూ తెలంగాణలో ప్రజాపాలన చేస్తున్నారని అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క అల్లాజి, ఎంగలి రఘు, గుత్తి బాలస్వామి, మంగళపల్లి సురేందర్ రెడ్డి, రమేష్, మల్లేష్, ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

## చికెన్ సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సాయి ప్రభు హోమ్స్ లోని నూతనంగా ఏర్పాటు చేసినటువంటి శ్రీ ఎల్లమ్మ చికెన్ సెంటర్ ను ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు ఎల్లమ్మ చికెన్ సెంటర్ యజమాని ప్రవీణ్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, బడంగ్ పేట్ మాజీ సర్పంచ్, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు నడికుడ యాదగిరి, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రేసు నర్సింహారెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించాలి

### ప్రజలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం:గీసుగొండ సీఐ బాబులాల్

**విశ్వంభర,వరంగల్:** గీసుగొండ మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న గణపతులను గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16, 17న నిమజ్జన కార్యక్రమంలో ప్రశాంత వాతావరణంలో గణపతులను నిమజ్జనం చేసుకోవాలని గీసిగొండ సీఐ బాబూలార్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నిమర్జనంలో పాల్గొనే ప్రజలు, యువకులు, భక్తిశ్రద్ధలతో నిమజ్జనంలో పాల్గొనాలని, గ్రామాలలో గొడవలకు పాల్పడకూడదని, ప్రజలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## చిల్డ్రన్స్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శివాలయం నగర్ కాలనీలో చిల్డ్రన్స్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఇందిరమ్మ కృష్ణారెడ్డి, అనూష సతీష్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ చెక్కల శోభ లక్ష్మణ్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వినాయకుడి ఆశీస్సులతో ఆమనగల్ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని లక్ష్మణ్ కోరారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీధర్, విష్ణువర్ధన్ రెడ్డి, లిల్లామ్మ, శ్రీరాములు, రామకృష్ణ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటాం: మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, మహేశ్వరం:** ఇందిరమ్మ హయాంలో ఇచ్చిన భూములను బీఆర్ఎస్ పాలనలో లాక్కున్నారని భూ బాధితులు మంత్రి శ్రీధర్ బాబు, కేఎల్ఆర్ ముందు దళితులు వాపోయారు. బడంగ్ పేట కార్పొరేషన్ మల్లాపూర్‌లో వై ఎ ఆర్ గార్డెన్ లో బడంగ్ పేట, మీర్పేట్ కార్పొరేషన్ల రైతులతో సమావేశం అయ్యారు. కాసువాగు భూములకు దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని నాదర్ గుల్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగు చేసిన భూములను లాక్కొని ప్రభుత్వ బిల్డింగ్స్, లేఅవుట్ వేస్తూ మా కుటుంబాలను రోడ్డు పాలు చేశారని బడంగ్ పేట, కుర్మల్ గూడ, గుర్రంగూడ దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థలాల పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపించకుండా సర్టిఫికెట్లతో సరిపెడుతున్నారని లబ్ధిదారులు మంత్రి శ్రీధర్ బాబు, లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కబ్జాదారులపై ఉక్కుపాదం మోపేందుకే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా హైడ్రాను తీసుకొచ్చామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. చెరువులు, పార్కులు ఎక్కడెక్కడ కబ్జాలు అయ్యాయో రిపోర్ట్లు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, యల్మేటి అమరేందర్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, బొక్క జంగారెడ్డి, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గుడ్ల శ్రీనివాస్ సహా కాంగ్రెస్ నాయకులు, స్థానిక రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## హరిత హారంలో చెట్లు నాటిన వైస్ చైర్మన్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ 23వ వార్డులో వార్డు కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి రఘు ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్జీవోస్ కాలనీ పార్కు పునరుద్ధరణ పనులను మునిసిపల్ వైస్ చైర్మన్ మారినేని వెంకన్న శుక్రవారం చెట్లు నాటి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి మూలగుండ్ల వెంకన్న టీఎన్జీవోస్ నాయకులు జిన్నా రెడ్డి శ్రీనివాస్ ఎన్జీవోస్ కాలనీ వాసులు యశ్వంత్ తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ బాలు ఉస్మాన్, వార్డు ప్రజలు నాగలక్ష్మి, మేకవాణి,భారతి, అశ్విని, మాధవి, పార్వతి, కళ్యాణి, దివ్య, లత, స్వాతి, స్వప్న, రోజా పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి పేదలకు ఒక వరం

### పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా:ఎమ్మెల్యే వేముల వీరేశం



**విశ్వంభర, రామన్నపేట:** కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసాగా నిలుస్తుంది అని గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం రామన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మండలంలో మంజూరైన 99 కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలు, ప్రజలను కలవనివ్వరా

**విశ్వంభర, హనుమకొండ:** పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై దాడి, మాజీ మంత్రులు అరెస్టులు, నిర్బంధాలు, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న క్రమంలో దాస్యం వినయ్ భాస్కర్ ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, ప్రజలను కలవనివ్వరా అని పోలీసులను ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలోకి వచ్చేవారి వివరాలు ఎందుకు తీసుకుంటున్నారని, పార్టీ కార్యాలయం గేట్లను ఎందుకు మూసివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమని అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్ది సేపు పోలీసులకు, పార్టీ శ్రేణులకు వాగ్వాదం జరిగింది.



## బీఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులు




**విశ్వంభర,మహేశ్వరం:** ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా ప్రతినిధుల పై జరుగుతున్న దాడులకు నిరసనగా చేపట్టిన ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అనచివేయలేరని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై గురువారం జరిగిన దాడికి నిరసనగా మహేశ్వరం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలకు ప్రయత్నించగా మహేశ్వరం పోలీసులు కార్యక్రమాన్ని భంగపరుస్తూ అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అనచివేయలేరని, రానున్న రోజుల్లో ప్రజానాయకురాలు మహేశ్వరం శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలతో ప్రభుత్వప్రజావ్యతిరేక విధానాలపైపటిష్టమైన ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

## వైద్యుల నిర్లక్ష్యం, ఏడేళ్ల పాప మృతి



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన జన్నే ఉమారాణి–రాజు దంపతుల కుమార్తె ఏడేళ్ల పాప జన్నే సాయి శ్రీ కి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులు హన్మకొండలోని డాల్ఫిన్ పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా ఆసుపత్రిలోని వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గురువారం పాప మృతి చెందింది. దీంతో బంధువులంతా డాల్ఫిన్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి వద్ద స్థానిక పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాప మృతికి కారణమైన వైద్యులను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు హన్మకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అలాగే ఆస్పత్రి లైసెన్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాప మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

## పోషకాహారం ప్రాముఖ్యత పై అవగాహన సదస్సు



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడెంలోని అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారం పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వి.వెంకటరమణ హాజరై మాట్లాడారు. పోషన్ మహ గురించి వివరించారు. అనంతరం అన్నప్రాసన నిర్వహించారు. బాలామృతంతో లడ్డులు తయారు చేసి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, హేమలత, బాలమణీ, బిసి, అశోక్, స్కూల్ హెడ్మాస్టర్, సిబ్బంది, ఎఎన్ఎం మంజుల, అంగాన్ వాడీ టీచర్లు, సత్యవతి, ప్రతిభా భారతి, విఓ, సురేఖ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## ఎంపీ పోరిక బలరాం నాయక్ ఆకస్మిక తనిఖీలు

### రోగులను పరామర్శించిన ఎంపీ, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



**విశ్వంభర,మహబూబాబాద్:** కేసముద్రం మండల ఇంటికన్నె గ్రామానికి చెందిన తాడబోయిన విజయ్ అకాల వర్షాలతో ఇంట్లోకి నీరు వచ్చి తీవ్ర నష్టం కలగడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసుకోగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎంపీ పోరిక బలరాం నాయక్ పరామర్శించి ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను, స్థానికులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో ఎంపీ బలరాం నాయక్ సమావేశమైన రోగులకు అందిస్తున్న వైద్య సౌఖర్యాలను ఆరా తీశారు. రోగుల పట్ల భాధ్యతతో వైద్యులు, సిబ్బంది మెలగాలని తెలిపారు. అదే విధంగా అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహనకల్పించాలని సూచించారు. గ్రామాల్లో మరియు ఆసుపత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సమన్వయం ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెడెంట్ డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ లకావత్, కేసముద్రం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి, టిపిసిసి మెంబర్ గూగులోత్ దస్రు నాయక్, గూడూరు మాజీ సర్పంచ్ నూనవత్ రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్.వెంకటేశ్వర్లు, కదిరే సురేందర్, వెంకట్ నాయక్, వంశి నాయక్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కక్కిరేణి గ్రామంలో సి.ఐ.డి.సి అండ్ టి.బి.ఓ.సి.డబ్లు.డబ్లు.బి ఆధ్వర్యంలో 90 రోజులు కుట్టు శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పదాలు, జాన పదాలతో హోరెత్తిన కార్యశాల



**విశ్వంభర,హైదరాబాద్:** ఏ.వీ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి కార్యశాలలో అంతరించిపోతున్న జానపద కళల ప్రదర్శన – పరిరక్షణ అన్నఅంశంపై పద్మశ్రీ ఒలియా దాసరి నార కొండప్ప బుర్ర వీణ కళా ప్రదర్శన సభికులను ఆకటుకుంది. బుర్ర వీణ తయారీ విధానం, బుర్ర వీణ కు ఉపయోగించే కాయలు, ఏ ఋతువులలో ఆకాయ పండుతుంది. బుర్రవీణ యొక్క సంగీత స్థాయి, బుర్రవీల నుండి ఉద్భవించే మూల ధ్వని, ఈ బుర్ర వీణ కళా రూపాన్ని ప్రదర్శించే విధానాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. గొంతు కిన్నెర బాలయ్య 12 మెట్ల కిన్నెర ఏ విధంగా అయితే సంగీతాన్ని సృష్టిస్తుందో అదేవిధంగా గొంతు నుండి 12 మెట్ల కిన్నెర సంగీతాన్ని సృష్టించి ప్రేక్షకులను అబ్బురపరిచాడు. డా. దాసరి రంగ ఈ ఇద్దరి కళా ప్రదర్శనను సమన్వయం చేస్తూ పరిశోధనత్మకంగా వివరించి విడమర్చి చెప్పాడు. డక్కాలి శంకరమ్మ 82 సంవత్సరాల వయసులో 12 మెట్ల కిన్నెర వాయించిన విధానం ఆమె ఆరోగ్య రహస్యం, ఆమె మాట, పాట ఆహుతులను ఆలరించయి. ఆమె కుమారుడు అయినా డక్కలి యాదయ్య కళారూపం అత్యద్భుతం, ఈ సదస్సుకు సభా అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ సీ. హెచ్ రాజలింగం ఈ కలలను బ్రతికించడం భవిష్యత్ తరాలైన విద్యార్థిని, విద్యార్థుల పైన మాత్రమే ఉందన్నారు. వీటిని ముందు తరాలకు అందించే బాధ్యత మీరు భుజాన వేసుకోవాలని నొక్కి వక్కాణించారు. ఈ సదస్సు గురించి మాట్లాడుతూ భగవంతరెడ్డి ఇలాంటి కార్యక్రమం నా భూతో నా భవిష్యత్ అన్నట్టు ఉంది. మన సంస్కృతినీ, సాంప్రదాయాలను తట్టి లేపుతుంది. బలగం చలన చిత్రాన్ని చూసి మన భవిష్యత్ తరాలు విస్మయానికి లోనవుతారు. బలగం చిత్రంలో ఒలియా దాసరి నార కొండప్ప వీణ ప్రదర్శన ఉందిని చెప్పుకొచ్చారు. ప్రత్యేక ఆహ్వానితురలిగా హాజరైన డా. పి. మృదుల కాళోజి నారాయణరావు గురించి భాషా పుట్టు పూర్వోత్తరాల గురించి అద్భుతంగా వాఖ్యానించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కాశిం తెలుగు భాషా గురించి తెలుగు భాష ఎదుర్కొన్న అవరోధాల గురించి తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో కాలోజి నారాయణరావు, దాశరధి కృష్ణమాచార్యులు, వట్టి కోట అల్వార్ స్వామిలా పాత్రను. అదేవిధంగా జానపదమంటే కాళోజి నారాయణ రావు కి ప్రాణ పద మంటూ తను చిన్నప్పుడు విన్న కొన్ని జాన పదాలను ఆలపించాడు. ఆయన మాట్లాడుతూ ఉంటే ఇంకా ఇంకా వినాలనే సక్తి సభికులలో కలిగింది. సుద్దాల హనుమంతు నేపథ్యం, పాట నేపథ్యం, గురించి అద్భుతంగా మాట్లాడారు. ఈ సదస్సుకు కన్వీనర్ గా వ్యవహరించిన డా. జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ఈ సదస్సుకు హాజరైన అందరికీ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇలాంటి కళలను ప్రోత్సహించాలి. ఆ దిశగా ఎన్నో పరిశోధనలు సాగాలని సెలవిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కళా ప్రియులు, జంట నగర వాసులు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన అతిథులు, పాల్గొని విజయవంతం చేశారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకోండి

### డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహ రించాలని డీజీపీకి సీఎం రేవంత్ ఆదేశించారు. లా అండ్ ఆర్డర్‌పై సీఎం రేవంత్ ఫోకస్ చేశారు. శుక్రవారం లా అండ్ ఆర్డర్‌పై సమీక్ష నిర్వహించను న్నారు. శాంతి భద్రతలను కాపాడే విషయంలో సీరియస్‌గా ఉండాలని డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారం పోయిందనే అక్కసుతో కొందరు కుట్రలు చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. సైబరాబాద్ కమిషనర్లతో డీజీపీ జితేందర్ సమావేశమయ్యారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్న డీజీపీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ప్రయ త్నించే వ్యక్తులపై జీరో టాలరెన్స్ ఉంటుందన్నారు. ప్రజలందరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

## డీఎస్పీ రవీందర్ రెడ్డినీ కలసిన పటాన్ చేరు జర్నలిస్టులు



**విశ్వంభర,పటాన్‌చేరు:** అక్రిడేషన్ తో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరిని సమానంగా చూడాలని పటాన్ చేరు నియోజకవర్గ జర్నలిస్టులు పటాన్ చేరు డీఎస్పీ రవీందర్ రెడ్డిని శుక్రవారం ఉదయం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలాంటి వివక్షత లేకుండా, చిన్నా, పెద్ద అనే తారతమ్యం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరిని ఒకే విధంగా చూడాలని కోరారు. అక్రిడేషన్ లేకపోతే వారు జర్నలిస్టులు కారు అనే ధోరణి విడనాడి కలిసికట్టుగా ఉండాలని ప్రభుత్వంచే గుర్తించబడిన పత్రికల ఆధ్వర్యంలో పనిచేసే జర్నలిస్టులు నకిలీ జర్నలిస్టుగా పరిగణలోకి రారని ఎలాంటి పత్రికలో పని చేయకుండా అక్రమ వసుల్లపాల్పడిన వారిని నకిలీ జర్నలిస్టుగా పరిగణిస్తామని ఆయన అన్నారు. అలాంటివారు ఎవరైనా అనుమాదాస్పదంగా కనిపిస్తే తక్షణమే ఫిర్యాదు చేస్తే వారిపై తగిన చర్య తీసుకుంటామని డీఎస్పీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులు ఎలాంటి ప్రభుత్వ పథకాలు, ఇండ్ల జాగలు పొందకుండా ఎన్నో యేండ్లుగా వర్కింగ్ జర్నలిస్టులుగా కష్టపడి పనిచేస్తున్నారని గుర్తుచేశారు. అలాగే బిల్డర్ల వద్ద అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న జర్నలిస్టులు ఎవరైనా సరే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూపాత్రికేయ మిత్రులు నా మాటలనువక్రీకరించి రాశారు. నేను అక్రిడేషన్, నాన్ అక్రిడేషన్ అనే పదాలు వాడలేదని, సంస్థ గుర్తింపు లేకుండా, ఐడి కార్డులు లేకుండా తిరుగుతున్న నకిలి విలేకరులపై కఠిన చర్యలు తీసుకుంటామని మాత్రమే చెప్పానని వివరణ ఇచ్చారు. వర్కింగ్ జర్నలిస్టులందరినీ సమానంగా గుర్తిస్తామని అన్నారు.



(విశ్వంభర, ఖైరతాబాద్): ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించి పూజలు నిర్వహించిన టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, సెక్రెటరీ విక్రమ్ కె ఆర్ రాజ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కురిడి శ్రీనివాస్, సెంట్రల్ స్పోర్ట్స్ సెక్రెటరీ బొలిగిత శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలపై హాస్టల్ వార్డెన్ అసభ్యకర ప్రవర్తన

### బగ్గుమన్న విద్యార్థి సంఘాలు

### వార్డెన్‌ను, రిసెప్షన్‌ను తొలగించాలంటూ విద్యార్థుల నిరసన ధర్నా



**విశ్వంభర,షాద్‌నగర్:,** మేధాపాఠశాల హాస్టల్‌లో జరుగుతున్న అక్రమ సంబంధం (ఇల్లీగల్) వ్యవహారం వల్ల అటు బాలికలకు, ఇటు విద్యార్థులందరికి తీవ్ర నష్టం జరుగుతుందని పాఠశాల విద్యార్థిని విద్యా ర్థులు అగ్రహించారు. హాస్టల్‌లో జరిగింది ఎక్కడ బయట పెడతారేమోనని భయంతో పిఈటిని తొలగించడమే కాకుండా విద్యార్థులను పరీక్షలలో మార్కులు తక్కువ వేయడంతో పాటు పాఠశాల నుండి సస్పెండ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడినందుకు గాను విద్యార్థులు నిరసనకు దిగారు. ఈ విషయాన్ని బాలికలు మీడియాకు ద్వారా బయటపెట్టడంతో వార్డెన్‌ను, రిసెప్షన్ వాళ్ళను తొల గించాలంటూ డిమాండ్ చేస్తూ పేరెంట్స్, ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు విద్యార్థుల తరపున ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి ఇంచార్జి శంకర్ రాథో డ్ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం హాస్టల్ వార్డెన్ రామకృష్ణ (19) పాఠశాల సంబంధించిన బాలికలను, అలాగే హాస్టల్లో పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు విద్యార్థినీలను విద్యార్థులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారని, అందుకుగాను హాస్టల్ వార్డెన్స్ రామకృష్ణను, మహిళను సస్పెండ్ చేసి పంపించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు.పాఠశాల రద్దు గురించి జిల్లా విద్యాశాఖ అధికారికి, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తారని ఎంఈఓ హెచ్చరించారు. యాజమాన్యం హాస్టల్‌వార్డెన్ ఇద్దరినితొల గించిన ట్లువిద్యార్థిసంఘాలకు, మీడియాకు తెలిపారు.



## శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల కరపత్రాలు ఆవిష్కరణ

**విశ్వంభర, నారాయణపూర్:** శ్రీ కంఠమహేశ్వర దేవస్థాన బోనాల మహెూత్సవ కరపత్రాలను దేవాలయ ప్రాంగణంలో గౌడ కులస్తులు కలిసి ఆవిష్కరించారు. నవంబర్ 15,16, 17 న జరిగే ఉత్సవాలను గౌడ కులస్తులు, బంధువులు, గ్రామ ప్రజలు పాల్గొని స్వామి వారి కళ్యాణం, అలాగే బోనాలకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు, కంఠమహేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షులు రాపర్తి కరుణాకర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు బద్దం యాదయ్య గౌడ్, గీతా పనివారల సంఘం అధ్యక్షులు నీళ్ల గాలయ్య గౌడ్, మొగుదాల సత్తయ్య, పాలకూర్ల యాదయ్య గౌడ్, పాలకూర్ల సతీష్ గౌడ్, పందుల యాదగిరి గౌడ్, నీళ్ల రాజు గౌడ్, దూసరి నారాయణ గౌడ్, వీరమల్ల కృష్ణయ్య గౌడ్, బొమ్మని రఘుగౌడ్, సుర్వి వెంకటేష్ గౌడ్, బద్దం లింగస్వామి గౌడ్, విరమళ్ల వెంకటేష్ గౌడ్, ఐటిపాముల లింగస్వామి గౌడ్, చింతల గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

## రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**విశ్వంభర,మెట్‌పల్లి:** మెట్ పల్లి పట్టణం బోయవాడకు చెందిన మున్నూరు కాపు రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల గణనాధునికి ప్రత్యేక పూజలు చేసి వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మున్నూరు కాపు రైతు మిత్ర సంఘ అధ్యక్షులు ధ్వనికెల నవీన్, లోలపు అనిల్, డాక్టర్ సాగర్ పటేల్, డాక్టర్ సంధ్య పటేల్, గయా చిన్న రాజం, జంగిడి పెద్ద వెంకటి, నడిపి రాజం, గంగారెడ్డి, కొట్టాల రవి, అజయ్, రాజేష్, ఆకుల నరేష్, సంజీవ్, నాగుల అంజయ్య, మారుతి, మౌళి, అరిగేలా గంగాధర్, అల్లే నరసయ్య, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి పథకాలను సద్వినియోగం చేసుకోండి



**విశ్వంభర, భూపాలపల్లి:** మహిళా శక్తి పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని డిపిఎం రవి మహిళా శక్తి లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. సెర్ప్-జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు మండల సమాఖ్య మొగుళ్ళపల్లి ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకాలు పాడి గేదెలు, ఆవులు, పెరటి కోళ్ల పెంపకం లబ్ధిధారులకు మండల కేంద్రంలోని రైతు వేధికలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారి మంజుల అధ్యక్షతన మహిళా శక్తి లబ్ధిధారులకు అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిపిఎం రవి మహిళా శక్తి లబ్ధిధారులను ఉద్దేశించి మాట్లాడారు. పీ.ఎం. ఇ.జీ.పీ పథకం కింద 35 శాతం సబ్సిడీతో బ్యాంకు ద్వారా మహిళా శక్తి లబ్ధిదారులకు లోన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ రాకేష్ మాట్లాడారు. పాడి గేదేలు, ఆవుల రకాలు, ఫీడింగ్ ఎలా చేయాలి, ఎన్ని లీటర్ల పాల దిగుబడి చేయొచ్చు, ఏ ఏ వ్యాధులు వస్తాయి ఎలా వైద్యం చేయాలనే విషయాలపై లబ్ధిధారులకు అవగాహనణ కల్పించారు. పెరటి కోళ్ళు, నాటు కోళ్ల పెంపకంలో 4, 5 నుంచి 6 వారాల వరకు లాభాలు పొందవచ్చన్నారు. ఈ సదస్సులో ఎంపీడీవో హుస్సేన్, డిపిఎం నారాయణ, ఏపీఎం అంబాల రవివర్మ, ఏపీఓ హలీమ్, ఆకినపల్లి ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ అనిల్, సీసీలు బాపురావు, శ్రీనివాస్, ప్రవీణ్, విఓఏలు, మహిళా శక్తి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి నగర్ ఆధ్వర్యంలో అన్నదానం



**విశ్వంభర,మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీలో చిల్డ్రన్స్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం మధ్యాహ్నం భాష బోయిన శ్రీకాంత్ తుమ్మనపల్లి వేదాచారి భీమరాజు రాంబాబు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యుల దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వినాయకుడి ఆశీస్సులతో కాలనీవాసులు ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కమిటీ దంపతులు కోరారు. ఈ పూజా కార్యక్రమంలో పిట్టల జగన్, వెన్నం సాయినాథం, సురేందర్ రెడ్డి, గాండ్ల కిరణ్, మురళి, తోట శ్రీరాములు, మీనయ్య, కుసం సదయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామపంచాయతీలో ఓటర్ల జాబితా ప్రదర్శన




**విశ్వంభర,ఆమనగల్లు:** ఎన్నికల సంఘం తాజాగా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఎలక్టోరల్ రోల్స్ తయారీ మరియు ప్రచురణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని దానికి అనుగుణంగా అన్ని గ్రామపంచాయతీ కార్యాలయల్లో కార్యదర్శుల ద్వా రా ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచారని ఎంపీపీ ఆఫీసులో అన్ని పంచాయతీల జాబితా ఉందని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. కాగా గత వారం రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా జిల్లాల్లోని మొత్తం జిల్లా యంత్రాంగం, క్షేత్రస్థాయి సిబ్బంది సహాయక చర్యలు, పునరావాసం, పునరుద్ధరణ చర్యలలో నిమగ్నమై ఉన్నారు. ఎన్ని కల సంఘం ఈ పరిస్థితిని పరిశీలించి, ప్రకృతి వైపరీత్యాల నివారణ చర్యలకు ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా పరిపాలనకు అంతరాయం కలిగించకూడదని నిర్ణయించిందని, గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ మరియు ప్రచురణను మళ్లీ కొత్తగా షెడ్యూల్ విడుదల చేసిందని, ఆ ప్రకారం ఈనెల 13 న రాజకీయ పార్టీల ప్రతినిధు లతో సమావేశం, 18న జిల్లా ఎన్నికల అధికారుల స్థాయి సమావేశం, 19న ఎంపీడీవోల ద్వారా పంచాయతీ ఓటర్లజాబితా అభ్యంతరాల స్వీకరణ నువ్వే కఠినడిపిఓ ద్వారా అభ్యంత రాల తొలగింపు, 26నజిల్లా పంచాయతీ అధికారి ద్వారా ఫోటోఓటర్ల తుది ప్రచురణ ఉంటుందని రాష్ట్రఎన్నికల కమిషనర్ పార్థసారథినోటిఫికేషన్‌జారీచేశారని ఎంపీడీవో మాధురి తెలిపారు.

## గణనాథుడిని దర్శించుకున్న ఎంపీ కడియం కావ్య



**విశ్వంభర, హనుమకొండ:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ, నక్కలగుట్టలో జీడబ్ల్యూఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి మండపాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపి డాక్టర్ కడియం కావ్య స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వాడవాడనా కొలువుదీరిన గణనాథుల ఆశీర్వాదం ప్రజలకు ఉండాలని కోరారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతన్నలు ఆనందంతో గడపాలని గణపతిని ఎంపీ డా.కడియం కావ్య ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ హనుమకొండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



(విశ్వంభర, మహబూబాబాద్): మాజీమంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టుకు నిరసిస్తూ మహబూబాబాద్ లో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆధ్వర్యంలో నిరసన. (విశ్వంభర, మహబూబాబాద్)

## హైదరాబాద్‌ను అద్భుతమైన క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌ను ఇండోర్ తరహాలో అద్భుతమైన క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ విభాగపు అధికారులు ఇండోర్ కు వెళ్లి అధ్యయనం చేయాలని అన్నారు. అక్కడ అనుసరిస్తున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. ఏయే ఏజెన్సీలు, స్వచ్ఛంద సంస్థలు అక్కడ పనుల్లో పాలుపంచుకున్నాయో తెలుసుకొని చర్చలు జరపాలని, వీలైతే వారిని భాగస్వాములను చేయాలని చెప్పారు. క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఇండోర్ కార్పొరేషన్ ఆదాయ వనరులెలా సమీకరిస్తుందనే వివరాలు కూడా తెలుసుకోవాలని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధితో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్ పాత్ ల అభివృద్ధి, క్లీనింగ్, ఇతర పనుల్లో పురోగతిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లో అయిదేండ్ల కిందట కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం కింద 811 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టారని, వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవటం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది డిసెంబర్ తో కాంట్రాక్టు గడువు ముగిసిపోతుందని, అందుకే రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలను ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. గడువులోగా అన్ని రోడ్ల పనులను పర్యవేక్షించి, వెంటనే బాగు చేయించాలని చెప్పారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి 15 రోజుల్లోగా తనకు పూర్తి నివేదికను అందించాలని సీఎం ఆదేశించారు. తప్పుడు నివేదికలు ఇస్తే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లతో పాటు చెత్త సేకరణపై జీహెచ్ఎంసీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరించేలా పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అవసరమైతే జీఐఎస్, క్యూ ఆర్ స్కాన్ లాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం చెప్పారు. జీహెచ్ఎంసీలో నిరంతరం జరిగే పనులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా నిధుల సమీకరణకు కూడా స్పష్టమైన ప్రణాళికలు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పుడున్న బకాయిల చెల్లింపులకు అవసరమైన నిధులను తాత్కాలికంగా సర్దుబాటు చేసుకోవాలని చెప్పారు. ఆదాయం పెంచుకునే మార్గాలతో పాటు, ఇప్పుడున్న లొసుగులను సవరించుకోవాలని అన్నారు. జీహెచ్ఎంసీ ఆస్తుల నుంచి వచ్చే అద్దెలు, అడ్వర్టయిజ్మెంట్లు, హోర్డింగ్‌ల ద్వారా వచ్చే ఆదాయం వస్తుందా.. లేదా కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మూసీ పరివాహక ప్రాంతంలో సేకరించే స్థలాల్లో ఉన్న నివాసితులకు పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. ఎక్కడా తమకు అన్యాయం జరిగిందని నిర్వాసితులు బాధ పడకుండా, వారికి భరోసా కల్పించాలని చెప్పారు. పునరావాస కాలనీలు ఎక్కడెక్కడ ఉన్నాయి, అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా.. లేదా అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు. చెర్లపల్లి రైల్వే స్టేషన్ అధునీకరిస్తున్నందున, పరిసర ప్రాంతాల నుంచి స్టేషన్‌కు చేరుకునే అప్రోచ్ రోడ్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారు లను ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న అటవీశాఖ భూమిని, పరిశ్రమల విభాగం భూములను వెంట నే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అక్కడున్న పరిశ్రమలను మరో చోటికి తరలించాలని చెప్పారు. స్టేషన్ ముందు పార్కింగ్, కమర్షియల్ జంక్షన్ కు వీలుగా అప్రోచ్ రోడ్లు డిజైన్ చేసుకోవాలని చెప్పారు.

## రాహుల్ గాంధీ లెక్చర్లు ఆపి.. రాజ్యాంగ ఉల్లంఘనలపై మాట్లాడండి



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రాహుల్ గాంధీ లెక్చర్లు ఆపి.. తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనలపై మాట్లాడాలని హరీశ్‌రావు సూచించారు. కోకాపేటలోని తన నివాసంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రాహుల్ గాంధీ అమెరికాలో తిరుగుతున్నట్టుండు.. అమెరికాలో పోయి లెక్చర్లు ఇస్తున్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, న్యాయం, ధర్మం అని అంటున్నారు. తెలంగాణలో జరుగుతున్న అణిచివేతలు, ఆంక్షలు, రాజ్యాంగ ఉల్లంఘనలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి. ఎందుకంటే ఇవాళ ఎమ్మెల్యేల ఫిరాయింపు, పీఏసీ చైర్మన్ నియామకం.. ఇవన్నీ రాజ్యాంగ ఉల్లంఘనలు. ఈ రాజ్యాంగ ఉల్లంఘనల నుంచి దృష్టి మరల్చడానికి లా అండ్ ఆర్డర్ సమస్యగా సృష్టించి, పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య కొట్లాటకు రేవంత్ రెడ్డి కుట్ర చేశారు. దాడులు చేసే ప్రయత్నం చేస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజల సమస్య మీద నుంచి దృష్టి మరల్చుతున్నడు అని హరీశ్‌రావు మండిపడ్డారు. రీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లోనీ పెత్తనం ఏంటని గాంధీ కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్ప, సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ బిఆర్ఎస్ నాయకులను అరెస్టులను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నాం. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు మహిళలని చూడకుండా అరెస్టులు చేయడం దుర్మార్గం. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### పరిస్థితులు దెబ్బతీసే వ్యక్తులపై జీరో టాలరెన్స్: డీజీపీ

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో** : శాంతి భద్రతల విషయంలో రాజీపడకూడదని డీజీపీ జితేందర్ అన్నారు. ఇటీవలి పరిణామాల దృష్ట్యా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణలో పరిస్థితులు దెబ్బతీసే వ్యక్తులపై జీరో టాలరెన్స్‌తో వ్యవహరిస్తామన్నారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని హెచ్చరించారు. పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ, భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలువురు భారాస నేతలను పోలీసులు ఇప్పటికే హౌస్ అరెస్టు చేశారు.శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలని అంతకు సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీ జితేందర్‌కు ఆదేశాలుజారీచేశారు. మధ్యాహ్నం పోలీసు యంత్రాంగంతో సమీక్షించాలని తెలిపారు.

### శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరించాలి: సీఎం రేవంత్ ఆదేశాలు

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలని డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రాజకీయ కుట్రలు సహించేది లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్? దెబ్బతీసే పనిలో బీఆర్ఎస్ పార్టీ ఉందని విమర్శించారు. 'అధికారం కోల్పోయామనే అక్కసుతో కొందరు శాంతి భద్రతలకు విఘాతం కల్పించే యత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా రకరకాల కుట్రలకు తెరలేపుతున్నారు. మధ్యాహ్నం పోలీస్ యంత్రాంగంపై పూర్తి సమీక్ష చేయాలని డీజీపీని ఆదేశించాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసే విధంగా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవు. రాజకీయ కుట్రలు సహించేది లేదు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లతో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్‌లలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఉద్ఘాటించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే, చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ప్రయత్నించే వ్యక్తులపై జీరో టాలరెన్స్ ఉంటుందని తెలిపారు. ప్రజలెవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

### మాజీ మంత్రి హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టు

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో ::** నగరంలో పలువురు బీఆర్ఎస్ నేతలను శుక్రవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ ఇంటికి ర్యాలీకి వెళ్లి బీఆర్ఎస్ సమావేశం నిర్వహిస్తామని వారు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావును గఅహనిర్బంధం చేశారు. శ్రీనగర్ కాలనీలోని ఇంట్లో సబితా ఇంద్రారెడ్డిని, వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు శంభీపూర్ రాజు ఇంటి నుంచి బీఆర్ఎస్ నేతలు ర్యాలీగా బయల్దేరాలని నిర్ణయించారు. దీంతో ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి నివాసాల వద్ద కూడా భారీగా పోలీసులు మోహరించారు.

### ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాలకు హాజరుకండి...
#### కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి, సంజయ్‌లకు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం కార్యక్రమాలకు హాజరుకావాలంటూ నలుగురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం లేఖలు పంపించారు. 1948, సెప్టెంబరు 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కోరారు.

### వరద బాధితులకు మానసిక వైద్యులు రామసుబ్బారెడ్డి రూ. 5 లక్షల విరాళం



**విశ్వంభర, విజయవాడ:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ కు ప్రఖ్యాత మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి గురువారం అయిదు లక్షల రూపాయల విరాళం అందజేశారు.. చిత్రంలో కుమారుడు ఇండ్ల విశాల్, ఇండ్ల స్వప్న.తమ వైద్య వృత్తిలో విజయవాడ నగరంతో దశాబ్దాల అనుబంధం ఉన్నదని, విజయవాడ, పరిసర ప్రాంత వరద సహాయ చర్యలలో భాగం పంచుకోవడం మా బాధ్యతగా భావించి ముఖ్యమంత్రి గారికి విరాళం అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా డాక్టర్ ఇండ్ల అన్నారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం
### *ఆటో డ్రైవర్ల అవగాహన సదస్సులో డీఎస్పీ రవి*

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్థానిక పబ్లిక్ క్లబ్ నందు ఆటో డ్రైవర్లకు పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ సాయిరాం, పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ రవి పాల్గొని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ, నిబంధనలు, మోటార్ ట్రాన్స్పోర్ట్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో అనేది ప్రతి సామాన్యుడి రథం, ఆటో డ్రైవర్లు వారి వృత్తిని గౌరవించాలి, ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి, ప్రతి ఒక్కరినీ సురక్షితంగా గమ్యానికి చేర్చాలి అని అన్నారు. ఆటోలకు చట్టపరమైన అన్ని అనుమతులు కలిగి ఉండాలి, డ్రైవర్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి అన్నారు. నిబంధనల మేరకు డ్రైవర్ యూనిఫామ్ ధరించాలి అన్నారు. రోడ్లపై ఇతరులకు ఇబ్బంది కలిగించవొద్దు, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపొద్దు, బాధ్యతగా నడుచుకోవాలి అన్నారు. ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే ఆటో సీజ్ చేయడం జరుగుతుంది. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు. సరదాకు ఆటోలు నడిపే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాము. పాఠశాల, కళాశాల విద్యార్థినిలను తీసుకెళ్లే వారు విద్యార్థినిలను సురక్షితంగా గమ్యానికి చేర్చాలి. కొత్త చట్టాలలో రోడ్డు ప్రమాదాలను తీవ్రమైన నేరంగా పరిగణిస్తూన్నారు. ప్రమాదం జరిగితే క్షతగాత్రులను అక్కడే వదిలేయకుండా తక్షణం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలి, క్షతగాత్రులను ప్రమాదం స్థలంలో వదిలేసి పారిపోతే కటిన చర్యలు ఉంటాయి అని అన్నారు. కాలం చెల్లిన ఆటోలను రోడ్లపై కి తీసుకురావొద్దు, వాతావరణ కాలుష్యం దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానిత వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలి, సమాజంలో నష్టం కలిగించే గంజాయి, గుట్కా, ఇతర నిషేధిత వస్తువులు, నకిలీ సరుకులు రవాణా చేయవొద్దు అని తెలిపినారు. ప్రయాణిస్తున్న వారు విలువైన వస్తువులు, బ్యాగ్‌లు, ఇతర వస్తువులు మర్చిపోతే వారికి, లేదా పోలీసు వారికి అప్పగించాలి అని కోరారు. సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్ మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంగణంలో పరిస్థితులకు అనుగుణంగా ఆటోలు నడపాలి, బస్సులు వచ్చి పోయే మార్గంలో అడ్డంకులు కలిగించవద్దు అని కోరారు. ఆటో నడిపే పద్ధతిలో, డ్రైవర్ నడవడికలో మార్పు అనేది రావాలి, సూర్యాపేట ఆటో డ్రైవర్లు మంచి పేరు తెచ్చుకుని ఆదర్శంగా ఉండాలని ఆర్టీసీ డీఎం అన్నారు. పోలీస్ కళాబృందం వారు పాటలతో ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ సురేందర్, పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### ఐసెట్ మొదటి విడుత సీట్ల కేటాయింపు పూర్తి..
#### *సెల్ఫ్ రిపోర్టింగ్‌కు 17 వరకు అవకాశం*

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఐసెట్ మొదటి విడుత సీట్ల కేటాయింపు పూర్తయింది. ఈ ఏడాది ఎంసీఏ కోర్సుల్లో 86 శాతం, ఎంబీఏలో 87.5 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు తొలి విడుతలోనే 80 శాతానికి పైగా సీట్లు భర్తీ కావడం విశేషం.ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కలిపి మొత్తం 34,748 సీట్లు ఉండగా, 30,300 సీట్లు తొలి విడుత కౌన్సెలింగ్‌లోనే నిండాయి. ఇక 4,448 సీట్లు మాత్రమే మిగిలాయి. 285 కాలేజీల్లో 91 కాలేజీలో వందశాతం సీట్లు నిండాయి. సీట్లు పొందిన విద్యార్థులంతా ఈ నెల 17లోపు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని అధికారులు సూచించారు. ఫీజు చెల్లించిన వారంతా ఈ నెల 25 నుంచి 28 వరకు విద్యార్హత సర్టిఫికెట్లను కాలేజీల్లో సమర్పించాలని సూచించారు.

### ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అందజేస్తాం



**విశ్వంభర, సంగారెడ్డి** : విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సమాజ నిర్మాణం బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోలు నియోజక వర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందోలు నియోజక వర్గం ఎడ్యుకేషనల్ హబ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ ద్వారా 6,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేస్తామని చెప్పారు. ఉద్యోగుల డీఏలు విడుదల చేయాలనే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు.

### మేడిగడ్డ బరాజ్‌లో కొనసాగుతున్న ప్రవాహ పరీక్షలు




**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలోని మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌లో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకు వరద ప్రవాహపు అంచనా పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పుణెకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ సంపత్, నాగరాజు ఆధ్వర్యంలో అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫెల్లర్ (ఏడీసీపీ) పరికరాన్ని పవర్ బోటుకు అమర్చి బరాజ్‌లోని అప్, డౌన్ స్ట్రీమ్‌ల్లో ప్రవాహాన్ని పరీక్షించారు.కాగా, బరాజ్‌కు 6,50,570 క్యూసెక్కుల వరద వస్తుండగా, మొత్తం 85 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. అలాగే అన్నారం బరాజ్‌కు 6,000 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా, కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి 6.50 లక్షల క్యూసెక్కులుగా పారుతూ లక్ష్మి బరాజ్ వైపు పరుగులు తీస్తున్నది. అలాగే ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. శుక్రవారం 6,24,800 క్యూసెక్కుల వరదరాగా, మొత్తం59 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో నీటిని దిగువకు పంపిస్తున్నారు.

### జూరాల డ్యాం రోడ్డుపై మొసలి.. భయంతో పరుగులు తీసిన జనం



**విశ్వంభర, అమరచింత** : వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రోడ్డుపై శుక్రవారం ఉదయం మొసలి సంచరించడం స్థానికంగా కలకలం రేపింది. అయితే, భయ భ్రాంతులకు గురైన బాటసారులు, చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు మొసలిని తాళ్లతో బంధించి ప్రాజెక్టులో వదిలిపెట్టారు. ఇదిలా ఉండగా, జిల్లాలో ఎక్కడ మొసలి సంచరించినా జూరాలలో వదిలిపెడుతుండడంతో ప్రాజెక్టులో వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతోపాటు నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుకు భారీగా వరద రావడంతో మొసళ్లు బయట సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళలనకు గురవుతున్నారు.

### జనగామ జిల్లాలో విషాదం.. రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

**విశ్వంభర, జనగామ:** జనగామ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. స్టేషన్ ఘనపూర్ మండలం శివునిపల్లిలోని సెయింట్ థామస్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఈరోజు ఉదయం హాస్టల్ నుంచి పారిపోయాడని పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారమిచ్చింది. అలాగే పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.కాగా, చిల్పూరు మండలం వంగాలపల్లి రైల్వే గేటు వద్ద సదరు విద్యార్థి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే విద్యార్థి పారిపోవడానికి పాఠశాలకు వాచ్‌మెన్ లేకపోవడమే కారణమని, వాచ్‌మెన్ లేకుండా నిర్లక్ష్యంగా పాఠశాల నడిపిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి బంధువులు డిమాండ్ చేశారు. విద్యార్థి స్వగ్రామం జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లు అని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష : పాడి కౌశిక్‌రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్: కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ఉండకపోతే ఇవాళ రేవంత్‌రెడ్డికి సీఎం పదవి దక్కేదా..? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రం సిద్ధించకపోతే అసలు తెలంగాణ సీఎం అనే పదవే ఉండేది కాదని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రెస్‌మీట్‌లో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి అవాకులు, చెవాకులు పేలడం మానుకోవాలని సూచించారు.'రేవంత్‌రెడ్డి చీటికిమాటికి కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, హరీశ్‌రావును దూషిస్తున్నరు. వాస్తవానికి కేసీఆర్ లేకుంటే ఇయ్యాల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా..? అసలు ఆ ముఖ్యమంత్రి కుర్చీ ఉండేదా..? నీకు ముఖ్యమంత్రి పదవి కేసీఆర్ పెట్టిన భిక్షే కదా..? ఎందుకు మరి ఎగిరెగిరి పడుతున్నరు. ఇగనన్నా మీ అవాకులు, చెవాకులు బంద్ చేయండి. మీ సంగతి తెలంగాణ ప్రజలకు అర్థమయ్యింది. మీ గుండాయిజం, రౌడీయిజం చూసింద్రు.' అన్నారు.'నిన్న మా హరీశ్‌రావును, ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి ఎక్కడో కల్వకుర్తికి ఎందుకు తీసుకపోయింద్రు..? హరీశ్‌రావు చేసిన తప్పేంది..? మీరు ఎందుకు ఈ వెకిలి చేష్టలు చేస్తుంద్రు..? మీరు పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్ని రోజులు ఈ అరాచకాలు చేస్తరు..? మీపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డయ్. ఇప్పటికే కొందరు తిరగబడుతున్నరు. మీరు ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ఇక ముందు ఏ ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూడా ప్రజల్లో తిరిగే పరిస్థితి ఉండదు' అని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.



## కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకొస్తాం

**- మంత్రి నారా లోకేశ్**

**విశ్వంభర, అమరావతి :** కేదార్ నాథ్ లో చిక్కుకున్న దాదాపు 20 మంది ఏపీ యాత్రికులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా వారు అక్కడ చిక్కుకుపోయారు. తమ సమస్యను యాత్రికులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా మంత్రి లోకేశ్ కు తెలియజేశారు. భోజనం కూడా దొరక్క ఇబ్బంది పడుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్ ప్రభుత్వం తరపున ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందరూ సురక్షితంగా తిరిగి వచ్చేలా తాను బాధ్యత తీసుకుని దగ్గరుండి పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు. "కేదార్ నాథ్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతున్నాం. ఈ లోగా వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉత్తరాఖండ్ ప్రభుత్వ సహకారాన్ని కోరాం. కేదార్ నాథ్ లో చిక్కుకున్న యాత్రికులు, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండండి" అని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. మరోవైపు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న యాత్రికులకు ఫోన్‌చేసి మాట్లాడారు. అక్కడి నుంచి సురక్షితంగా తరలించేందుకు అధికారులతో మాట్లాడామని, యాత్రికులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## విజయవాడ దుర్గమ్మ హుండీకి భారీగా ఆదాయం



**విశ్వంభర, అమరావతి :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భారీ ఆదాయం సమకూరింది. దేవస్థానం మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 15 రోజుల్లో హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించగా రూ.82,03,392 ఆదాయం వచ్చింది. భారీ వర్షం, బుడమేరు వరద దుర్గగుడి ఆదాయంపై తీవ్రంగా చూపించడంతో.. ఆదాయం తగ్గింది. అలాగే హుండీలా్‌లో బంగారు 145గ్రాములు, 1.870 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే 136 యుఎస్‌ఏ డాలర్లు, 40 కెనడా డాలర్లు, 25 కువైట్ దీనార్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్లు, 20 హాంకాంగ్ డాలర్లు వచ్చినట్లు దేవస్థానం డిప్యూటీ ఈవో తెలిపారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల భక్తులు ఆన్‌లైన్‌లో రూ.1.03 లక్షల విరాళాలు దేవస్థానానికి సమర్పించారన్నారు. దుర్గమ్మ హుండీల్లో కానుకల లెక్కింపును ఈవో రామారావు, దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు. మరోవైపు దసరా ఏర్పాట్లు, పవిత్రోత్సవాలు, ఆర్జిత సేవలకు సంబంధించి వైదిక కమిటీ సమావేశం నిర్వహించారు.. ఆలయ ఈవో రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే పవిత్రోత్సవాల్లో.. ఆలయంలో ఆర్జిత సేవలను భక్తులతో సంబంధం లేకుండా రుత్వికులు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించినట్లు ఈవో రామారావు తెలిపారు. దుర్గమ్మ ఆలయంలో పవిత్రోత్సవాల సమయంలో రాత్రి వేళ భక్తులను దేవస్థానం ప్రాంగణంలో నిద్ర చేయకుండా నియంత్రిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**విశ్వంభర, అమరావతి :** రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతోనే కోస్తా బంగ్లాదేశ్, ఉత్తర బంగాళాఖాతం పరిసర ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా అల్పపీడనం బలపడుతుంది. పశ్చిమ బెంగాల్, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. కోస్తాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని.. మిగతా ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని తెలిపింది. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. బలమైన ఉపరితల గాలులు గంటకు 3040 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

## శ్రీవారి దర్శనానికి 3 గంటల సమయం

**విశ్వంభర, తిరుమల :** తిరుమలకు యాత్రికుల రద్దీ సాధారణంగానే ఉంది. శ్రీవారి ఉచిత సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఉచిత సర్వదర్శనం కోసం 9 కంపార్టుమెంట్లలో యాత్రికులు వేచి ఉన్నారు. ఇక టైమ్ స్లాట్ (ఎస్ఎస్‌డీ) దర్శనానికి 4 కంపార్టుమెంట్లలో యాత్రికులు వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి 4 గంటల సమయం పడుతుంది. రూ. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతుంది. గురువారం తిరుమల శ్రీవారిని 63,544 మంది యాత్రికులు దర్శించుకున్నారు. 22,942 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం 3.37 కోట్లుగా ఉంది.



# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం..

- 8 మంది దుర్మరణం
- సంతాపం తెలిపిన సీఎం చంద్రబాబు



**విశ్వంభర, తిరుపతి :** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. చిత్తూరుబెంగళూరు ప్రధాన రహదారిపై బంగారుపాళ్యం మండలం మొగలి కనుమ రహదారిలో బస్సు, లారీలు ఢీ కొన్న ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు.

చిత్తూరు జిల్లా మొగిలి కనుమ రహదారిలో వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుతో పాటు మరో లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తుండగా, లారీ బెంగళూరు వైపు నుంచి వస్తోంది. లారీ ఇనుప చువ్వల లోడ్‌తో ఉండటంతో ప్రమాదం తీవ్రత పెరిగింది.

లారీ అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బస్సు నుజ్జునుజ్జైంది. బస్సులో ప్రయాణిస్తున్న వారు లారీలోని ఇనుప చువ్వల కింద పడి ప్రాణాలు కోల్పోయారు. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు, ఇనుప చువ్వల కింద ఇరుక్కుపోయిన ప్రయాణీకులతో ఘటనా స్థలం భీతావహంగా మారింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో పాటు ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. మరో 30 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను పలమనేరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవల కోసం చిత్తూరు తరలించారు.

### సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

చిత్తూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో 8 మంది మరణించడం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన సీఎం చంద్రబాబు, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మొగిలిఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచి వేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రవాణాశాఖ పటిష్టమైన భద్రతా చ ర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. ఘోర రోడ్డు ప్రమాదం ఘటనపై రవా ణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మొగలిఘాట్ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు మంత్రి సంతాపం తెలిపారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై మంత్రి అరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# కొనసాగుతున్న బోట్ల వెలికితీత



**విశ్వంభర, అమరావతి :** ప్రకాశం బ్యారేజ్ వద్ద బోట్లు తొలగింపు ప్రక్రియ అందర్ని ముప్పుతిప్పలు పెడుతుంది. బోట్లను బయటకు తెచ్చేందుకు మూడ్రోజులుగా అధికారులు, డైవింగ్ టీమ్ ఎంతో కృషి చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం రావటం లేదు. బోట్లను బయటకు తెచ్చేందుకు అందులో నిపుణుడైన అబ్బులు బృందాన్ని సైతం ప్రత్యేకంగా కాకినాడ నుంచి తీసుకువచ్చారు. అయినా వారి కృషి ఫలించలేదు. బయటకు తీసే సమయంలో లంకెల వల్ల బోట్లు కదలటం లేదు. దీంతో మరో భారీ బోటు సాయంతో చిక్కుకున్న బోటును బయటకు లాగేందుకు యత్నించారు. చివరికి గేటు నుంచి 10 అడుగులు కదిలాక బోటు బోల్తాపడి ఇసుకలో చిక్కుకుపోయింది. క్రేన్లు, లిఫ్టులతో బోల్తాపడిన బోటును పైకి లేపేందుకు విఫలయత్నం చేశారు. చివరికి బోట్ల తొలగింపు ప్రక్రియను శుక్రవారం అధికారులు నిలిపివేశారు. రేపు (శనివారం) బోటుకు బలమైన తాళ్లు, కొక్కేలు కట్టి బయటకు లాగాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల తొలగింపు ప్రక్రియ వరుసగా మూడోరోజూ కొనసాగింది. గేట్ల వద్ద చిక్కుకున్న నాలుగు భారీ పడవలను బయటకు తీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. రంగంలోకి దిగిన కాకినాడకు చెందిన పడవలను వెలికితీసే నిపుణుడు అబ్బులు నేతృత్వంలోని 14 మంది బృందం భారీ బోట్లు బయటకు లాగే ఏర్పాట్లు చేసింది. ఒక్కొకటి 50 టన్నుల పైగా బరువులాగే 7 భారీ పడవలతో రెస్క్యూ ఆపరేషన్ చేశారు. భారీ పడవలను ఒక దానితో మరోటి అనుసంధానించి చిక్కుకున్న పడవలకు గొలుసులతో కట్టి బయటకు లాగే ప్రయత్నం చేశారు. విశాఖకు చెందిన డైవింగ్ టీంతో ఓ బోటును రెండుగా కోశారు. రెండుగా కోసిన ఆ బోటును తొలుత బయటకు లాగేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం మిగిలిన 3 బోట్లనూ భారీ పడవల సాయంతో బయటకు తీయనున్నారు. బ్యారేజీ గోడలకు, గేట్లకు ఎక్కడా చిన్నపాటి నష్టం కూడా కలగకుండా బోట్లను తీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీలైనంత త్వరలో బోట్లు బయటకు తీసేలా చర్యలు తీసుకుంటున్నారు.

## శ్రీశైలం దేవస్థానానికి

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సర్టిఫికేట్



**విశ్వంభర, శ్రీశైలం :** శ్రీశైలక్షేత్ర ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, ప్రధానాలయ విస్తీర్ణం, ప్రధానాలయం చుట్టూ ఉన్న అరుదైన శిల్పప్రాకారం, క్షేత్రంలోని ప్రాచీన కట్టడాలు తదితర అంశాల ఆధారంగా శ్రీశైల ఆలయాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాబితాలో చేర్చినట్లుగా ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న దేవస్థానం మరో అరుదైన రికార్డ్ సొంతం చేసుకుంది. శ్రీశైలం ఆలయం విస్తీర్ణం, ఆలయంలోని నంది విగ్రహానికి ఆలయ నిర్వాహణకు ఇంగ్లాండ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు లండన్ సంస్థలో స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా పురాతన సంపద పరంగా, ఆధ్యాత్మికంగా, సాంస్కృతి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక సత్యం అత్యున్నత భాండాగారంతో కూడిన విలువలు గల సజీవ స్వరూపంగా పౌరాణిక ప్రాముఖ్యత కలిగి ఉన్నందుకు ఇంగ్లాండ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ లో శ్రీశైల ఆలయం నమోదు కాబడింది. దీంతో శ్రీశైలం దేవస్థానానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణ పత్రం వరించింది. లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ దక్షిణ భారత ప్రాంతీయ విభాగపు సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఉల్లాజి ఇలియాజర్ ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. శ్రీశైలక్షేత్ర ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, ప్రధానాలయ విస్తీర్ణం, ప్రధానాలయం చుట్టూ ఉన్న అరుదైన శిల్పప్రాకారం, క్షేత్రంలోని ప్రాచీన కట్టడాలు తదితర అంశాల ఆధారంగా శ్రీశైల ఆలయాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాబితాలో చేర్చినట్లుగా ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ ఈవో పెద్దిరాజుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాయింట్ సెక్రెటరీ ఉల్లాజీ ఎలియజర్ అందజేశారు. పరిపాలనా కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ ధ్రువీకరణపత్రం అందజేత కార్యక్రమానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌స్‌లో శ్రీశైల క్షేత్రానికి చోటు లభించడం సంతోషం కలిగిస్తుందన్నారు. అయితే గతంలోనూ దేవస్థానంలో 7 విభాగాలకు ఐ.ఎస్.ఓ ద్వారా ధ్రువీకరణ పత్రలను అందుకున్న శ్రీశైలం మల్లన్న ఆలయం సొంతం చేసుకుంది.

# చిరుత కోసం 8 రోజులుగా సెర్చ్ ఆపరేషన్..!



**విశ్వంభర, రాజమండ్రి :** చిరుత భయంతో రాజమండ్రి జనం బిక్కుబిక్కుమంటున్నారు. అదిగో చిరుత.. ఇదిగో చిరుత కబుర్లు జనాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి.. పలు మార్లు ట్రాప్ కెమెరాలో కనిపించినా.. బోనుకు మాత్రం చిక్కటం లేదు. అయిదు రోజులుగా చిరుత జాడను కనిపెట్టి జనం జంగిల్ నుంచి తప్పించటాని అటవీ శాఖ అధికారులు సతమతం అవుతున్నారు. ఈ చిరుత తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దివాన్ చెరువు అభయారణ్యంలోనే సంచరిస్తోందని ఫారెస్టు ఆఫీసర్లు నిర్ధారించారు. చిరుతను బంధించేందుకు అధికారులు విశ్వ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెండు సార్లు ట్రాప్ కెమెరాకు చిక్కింది. దీని కదలికల ఆధారంగా ట్రాప్ కెమెరాలను, బోన్లను వేర్వేరు ప్రదేశాలకు మారుస్తున్నారు. చిరుత సంచార దృశ్యాలు కెమెరాకి చిక్కాయని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి తెలిపారు. పాదముద్రలను సైతం గుర్తించామని, చిరుత కదలికలను గుర్తించేందుకు సీసీ, ట్రాప్ కెమెరాలను మరికొన్ని ప్రదేశాల్లో అమర్చినట్టు తెలిపారు. జనావాసాల్లో ఈ చిరుత సంచరిస్తున్నట్లు ఆధారాలు లభించలేదన్నారు.

### తెరమీదకు థర్మల్ డ్రోన్..

చిరుత సంచారాన్ని సాధారణ డ్రోన్ సహాయంతో గాలించినప్పటికీ జాడ కనపడలేదని అధికారులు చెబుతున్నారు. ఇక థర్మల్ డ్రోన్ సాయంతో చిరుత జాడ గుర్తించేందుకు ప్రయత్నిస్తామన్నారు. థర్మల్ డ్రోన్ రాత్రిపూట సైతం సమర్థంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా చిరుతపులి జనావాసాల్లోకి రావడం తక్కువని అధికారులు చెబుతున్నారు. ఎవరికైనా చిరుత ఎదురుపడితే పరిగెత్తవద్దని, అలాగే నిలబడి చేతులు పైకెత్తి నెమ్మదిగా వెనక్కి నడవాలన్నారు. భయపడి పొదల మాటున నక్కి కూర్చుంటే జంతువు అని దాడి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



## జగన్‌తో సెల్ఫీ దిగిన మహిళా కానిస్టేబుల్‌కు మెమో

**విశ్వంభర, అమరావతి :** మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌తో సెల్ఫీ దిగిన మహిళా కానిస్టేబుల్ అయేషా బానుకు ఉన్నతాధికారులు షాక్ ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఇలా వ్యవహరించడంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్‌కు ఛార్జిమెమో ఇస్తామని జైలర్ రవిబాబు తెలిపారు. ఆమె ఇచ్చిన వివరణ ఆధారంగా కమిటీ వేసి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా, టీడీపీ ఆఫీస్ ధ్వంసం కేసులో అరెస్టై గుంటూరు సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను జగన్ బుధవారం పరామర్శించారు. ఆయనతో ములాఖత్ అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో అదే జైలులో పని చేస్తోన్న మహిళా కానిస్టేబుల్ అయేషాబాను తన కుమార్తెతో అక్కడకు వచ్చారు. జగన్‌కు తాను అభిమానిని అని, ఓ ఫోటో కావాలని రిక్వెస్ట్ చేశారు. దీంతో జగన్ కూడా నవ్వుతూ దానికి అంగీకరించగా ఆయనతో కలిసి సెల్ఫీ దిగారు. ప్రెస్ మీట్ సమయంలోనే ఇలా జరగడంతో అంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సదరు కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు.

### వైసీపీ ఆగ్రహం

అటు, వైఎస్ జగన్‌తో సెల్ఫీ దిగిన మహిళా కానిస్టేబుల్‌కు ఛార్జిమెమో ఇవ్వడంపై వైసీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగిందని ఆరోపించింది. ఉద్యోగులను వేధించడంలో మీకు ఇదేం రాక్షసానందం అంటూ ఏపీ సీఎం చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనితపై మండిపడింది.

## విధినిర్వహణలో గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

**విశ్వంభర, విజయవాడ :** విజయవాడ కలెక్టరేట్‌లో తీవ్ర విషాదం నెలకొంది. డ్యూటీలో ఉన్న ఓ కానిస్టేబుల్ గుండెపోటుతో మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. చందూనాయక్ అనే కానిస్టేబుల్ విజయవాడ కలెక్టరేట్ లో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా అతను అస్వస్థతకు గురయ్యాడు. ఛాతిలో నొప్పిగా ఉండటంతో కుప్పకూలాడు. దీంతో అప్రమత్తమైన ఇతర సిబ్బంది చందూ నాయక్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ చందూనాయక్ మరణించాడు. గుండెపోటుతో ఆయన మరణించినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు.

## మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం

**సీబీఎస్‌ఈ విద్యార్థులకు ఊరట**

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 77 వేల మంది పదో తరగతి విద్యార్థులకు ఊరట కలిగేలా మంత్రి లోకేష్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో సీబీఎస్‌ఈ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఈ సంవత్సరం నుంచి రాష్ట్ర బోర్డు పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అంతర్గత పరీక్షల ఫలితాల ఆధారంగా మంత్రి లోకేశ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర బోర్డు పరీక్షలకు, సీబీఎస్‌ఈలకు తేడా ఉంటుంది. ఈ నేపథ్యంలో సీబీఎస్‌ఈ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు ఇటీవల విద్యాశాఖ పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో 64 శాతం మంది ఉత్తీర్ణులు కాలేదని తెలిపారు. అలాగే 326 పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. 556 పాఠశాలల్లో 25 శాతం లోపే ఉత్తీర్ణత శాతం నమోదైంది. 66 పాఠశాలల్లో 26 నుంచి 50 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలపై మంత్రి లోకేష్ దృష్టికి తీసుకురాగా సీబీఎస్‌ఈ విద్యార్థులకు రాష్ట్ర బోర్డు పరీక్షలకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు లోకేష్.



# 26 ఏండ్లలో ఇదే తొలిసారి.. బీసీసీఐ ప్రతిష్ఠకు 'నోయిడా' మచ్చ

- నోయిడా టెస్టు రద్దుతో నిరాశ.. మంచి అవకాశం కోల్పోయాం
- న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్ ఆటగాళ్లు అసహనం





**విశ్వంభర (క్రీడా విభాగం):** న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్‌ల మధ్య గ్రేటర్ నోయిడాలో జరగాల్సిన ఏకైక టెస్టు రద్దు చర్చనీయాంశం అవుతోంది. రెండు రోజులు వాన తెరిపినిచ్చినా ఔట్ ఫీల్డ్‌ను సిద్ధం చేయలేకపోవడం మైదానంలో వసతుల లేమికి అద్దం పట్టింది. ఇందులో బీసీసీఐ వైఫల్యం కూడా భాగమే. దాంతో, శుక్రవారం పిచ్, ఔట్‌ఫీల్డ్‌ను పరిశీలించిన మ్యాచ్ రిఫరీ జవగల్ శ్రీనాథ్ ఇరుజట్ల కెప్టెన్లతో మాట్లాడి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించాడు. టెస్టు క్రికెట్‌లో ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్ రద్దవ్వడం ఈ 26 ఏండ్లలో ఇదే తొలిసారి.

**రెండు రోజులు ప్రయత్నించినా..**

షెడ్యూల్ ప్రకారం న్యూజిలాండ్‌తో ఏకైక టెస్టు అఫ్గనిస్థాన్‌లో జరగాలి. కానీ, అక్కడ అంతర్జాతీయ స్టేడియం, సరైన వసతుల కొరత కారణంగా అఫ్గన్ క్రికెట్ బోర్డు బీసీసీఐని ఆశ్రయించింది. భారత్‌లో తమ టెస్టు మ్యాచ్ ఆడేందుకు అనుమతించాలని కోరింది. గతంలో అఫ్గనిస్థాన్ జట్టు ఇక్కడే ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడింది. అయితే.. ఈసారి దులీప్ ట్రోఫీ సమయంలోనే న్యూజిలాండ్‌తో ఏకైక టెస్టు ఆడాల్సి వచ్చింది.అందుకని బీసీసీఐ నోయిడాలోని మైదానాన్ని కేటాయించింది. కానీ, ఈసారి నోయిడాలో వాన తగ్గాక కూడా ఔట్ ఫీల్డ్‌ను ఆరబెట్టేందుకు సిబ్బంది రెండు రోజులు శ్రమించారు. దాంతోనే అర్థం చేసుకోవచ్చు అక్కడ వసతులు ఏ మేరకు ఉన్నాయో. ఎన్నో అంతర్జాతీయ టోర్నీలను సమర్థంగా నిర్వహించిన బీసీసీఐకి నోయిడా మైదానం మాయని మచ్చ తెచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఇప్పటికి ఏడు పర్యాయాలు**

ఇంతకుముందు ప్రపంచ క్రికెట్‌లో ఏడు పర్యాయాలు మాత్రమే ఒక్క బంతి పడకుండా టెస్టు మ్యాచ్ రద్దయ్యింది. తాజాగా నోయిడాలో న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్ ఏకైక టెస్టు రద్దుతో ఆ సంఖ్య ఎనిమిదికి చేరింది. అంతర్జాతీయంగా తొలి టెస్టు ఎప్పుడు రద్దు అయిందంటే..? 1890లో మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన మ్యాచ్‌లో ఒక్క బంతి పడలేదు.అనంతరం 1938లో అదే మైదానంలో ఇంగ్లండ్, ఆసీస్‌ల టెస్టు మ్యాచ్ రద్దయ్యింది. 1970లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరగాల్సిన టెస్టు వర్షార్పణం అయింది. న్యూజిలాండ్, పాకిస్థాన్‌ల మధ్య 1989లో ఒక టెస్టు, 1990లో వెస్టిండీస్, ఇంగ్లండ్‌ల మ్యాచ్ కూడా ఇలానే రద్దు అయ్యాయి. అనంతరం ఇక 1998లో రెండు పర్యాయాలు ఇలానే జరిగింది. ఫైసలాబాద్‌లో ఆతిథ్య పాకిస్థాన్, జింబాబ్వే మధ్య ఒక టెస్టు మ్యాచ్ సాగలేదు. నెడిన్ మైదానంలో న్యూజిలాండ్, భారత్ టెస్టులో కూడా ఒక్క బంతి పడలేదు.

**నోయిడా టెస్టు రద్దుతో నిరాశ.. మంచి అవకాశం కోల్పోయాం**

గ్రేటర్ నోయిడాలో జరగాల్సిన ఏకైక టెస్టు రద్దుతో న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్ ఆటగాళ్లు అసహనం వ్యక్తం చేశారు. వర్షాలకు తోడూ బీసీసీఐ వైఫల్యం కారణంగా టెస్టు మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. దాంతో, అంపైర్లు ఎట్టకేలకు శుక్రవారం మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. నాలుగు రోజులైనా సరే ఒక్క బంతి పడకుండానే మ్యాచ్ ముగియడం పట్ల రెండు జట్ల హెడ్‌కోచ్‌లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్, అఫ్గన్ కోచ్ జొనాథన్ ట్రాట్‌లు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏం అన్నారంటే..? 'నోయిడా టెస్టు రద్దు మమ్మల్ని తీవ్ర నిరాశకు గురి చేసింది. అఫ్గనిస్థాన్‌తో మాకు ఇదే తొలి మ్యాచ్. అందుకని మేము ఎంతో ఉత్సాహంగా ఎదురుచూశాం. నిరుడు వరల్డ్ కప్ నుంచి అఫ్గన్ జట్టు అద్భుతంగా ఆడుతోంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఉన్న మాకు త్వరలోనే శ్రీలంక సిరీస్ ఉంది. అందుకు సన్నాహకంగా ఈ టెస్టు ఉపయోగపడుతుంది అనుకున్నాం. కానీ, వర్షం కారణంగా మ్యాచ్ రద్దుతో చాలా అసహనానికి లోనయ్యాం అని న్యూజిలాండ్ కోచ్ స్టీడ్ అన్నాడు. దాదాపు ఇదే తరహాలో అఫ్గన్ కోచ్ జొనాథన్ ట్రాట్ కూడా స్పందించాడు. 'ఈరోజు ఉదయం మేము మైదానాన్ని పరిశీలించాం. దురదృష్టవశాత్తూ అది ఆటకు ఏమాత్రం అనువుగా లేదు. ఎలాగైనా సరే ఒక్క రోజైనా టెస్టు మ్యాచ్ జరగాలని అనుకున్నాం. కానీ, ఆటగాళ్ల భద్రతలో రాజీ పడలేం కదా!. కొన్నిసార్లు మనం ఏమీ చేయలేం. పరిస్థితులకు తలొగ్గక తప్పదు' అని ట్రాట్ వెల్లడించాడు.

# బయట మాది సోదరభావం.. మైదానంలోనే ప్రత్యర్థులం

## హాకీ కెప్టెన్ హర్మన్ ప్రీత్

**విశ్వంభర (క్రీడా విభాగం):** ఆసియా చాంపియన్ షిప్ సెమీస్ కు చేరిన భారత హాకీ జట్టు శనివారం పాకిస్థాన్తో తలపడనుంది. ఈ పోరు నామమాత్రమే అయినప్పటికీ.. సెమీసుకు సన్నాహకంగా వినియోగించుకోవాలని టీమ్ ఇండియా భావిస్తోంది. ఈ క్రమంలో తమ దేశాల మధ్య మ్యాచ్ ఎలా ఉంటుందనే దానిపై భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. మైదానంలో ఇతర టీమ్లతో ఎలా పోరాడతామో.. పాక్తో మ్యాచ్లోనూ అదే విధంగా ఆడతామని వ్యాఖ్యానించాడు. బయట తమది సోదరభావమేనని పేర్కొన్నాడు. గత కొన్ని మ్యాచుల్లో పాక్పై భారతే ఆధిపత్యం. ఈసారి కూడా అదే దూకుడుతో ఆడతామని హర్మన్ స్పష్టం చేశాడు. కీలక పోరుకు ముందు ప్రెస్ కాన్ఫరెన్స్లో హర్మన్తోపాటు పాక్ కెప్టెన్ భట్ మాట్లాడాడు. 'ఇప్పుడున్న పాక్ జట్టులోని సభ్యులతో జూనియర్ రోజుల్లోనూ కలిసి ఆడా. మైదానంలో మేం విజయం కోసం తీవ్రంగా కష్టపడతాం. ఒక్కసారి మ్యాచ్ ముగిశాక మేమంతా సాధారణంగా మాట్లాడుకుంటాం. ఒకరినొకరు మా అభిప్రాయాలను పంచుకుం టాం. మాకు సోదరుల్లాంటివారే. మైదానంలో ఇతర జట్లతో ఎలా ఆడతామో.. పాక్ తోనే అదే విధంగా తలపడతాం. హాకీలోనూ దాయాదుల పోరుపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువే. ప్రపంచవ్యాప్తంగా ఈ మ్యాచ్ కోసం ఎదురు చూస్తుంటారని అనుకుంటున్నా. గత ఫలితాలను మేం పట్టించుకోం. పాక్ వంటి జట్టును తేలిగ్గా తీసుకోం. వారికి ఇది కీలకమైన మ్యాచ్. ఇలాంటప్పుడు అన్ని అస్త్రాలను ప్రయోగించి గెలిచేందుకు ప్రయత్నిస్తారు. మేం మాత్రం ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం" అని హర్మన్ వెల్లడించాడు. "ఈ టోర్నీలో భారత్ ఫేవరెట్. ఇప్పటి వరకు అలాగే ఆడారు. మేం కూడా కష్టపడినా కొన్ని ఫలితాలు అనుకూలంగా రాలేదు. మరింత మెరుగైన ప్రదర్శన చేసి మా సెమీస్ అవకాశాలను పెంచుకుంటాం. ప్రతి మ్యాచ్ మాకు కీలకమే. క్రమశిక్షణతో కూడిన హాకీని ఆడుతాం. గత కొన్ని మ్యాచుల్లో ప్రత్యర్థులను అడ్డుకోవడంలో సఫలమైనట్లు భావిస్తున్నాం. భారత్ తోనూ అదే విధంగా ఆడతాం. పెనాల్టీ కార్నర్లో డిఫెండ్ చేయడంపై దృష్టిపెడతాం" అని భట్ తెలిపాడు.

# బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ.. అతడే నా ఓపెనింగ్ పార్టనర్: ఉస్మాన్ ఖవాజా

**విశ్వంభర (క్రీడా విభాగం):** భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య బోర్డర్ గావస్కర్ ట్రోఫీ నవంబర్ రెండోవారం నుంచి మొదలుకానుంది. ఈసారి ఐదు టెస్టుల సిరీస్ కావడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆసీస్ గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ కొట్టాలనే లక్ష్యంతో భారత్ సిద్ధమవుతోంది. మరోవైపు ఈసారి ఎలాగైనా టీమ్ ఇండియాకు చెక్ పెట్టాలని ఆస్ట్రేలియా భావి-స్తోంది. ఈక్రమంలో తమ జట్టు బ్యాటింగ్ ఆర్డర్పై ఉస్మాన్ ఖావాజా కీలక వ్యాఖ్యలు చేశాడు. తాను టాప్ ఆర్డర్లో ఆడేందుకు సిద్ధమని సీనియర్ ప్లేయర్ స్టీవ్స్మత్ వెల్లడించినట్లు కథనాలు వచ్చాయి. అయితే, స్మిత్ నాలుగో స్థానంలోనే బ్యాటింగ్ చేయాలని ఖవాజా సూచించాడు. డేవిడ్ వార్నర్ టెస్టులకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తనతో కలిసి ట్రావిస్ హెడ్ ఇన్నింగ్స్ను ప్రారంభిస్తే బాగుంటుందని ఖవాజా అభి-ప్రాయపడ్డాడు. "స్టీవ్ స్మిత్ అలా చెప్పి ఉండకపోవచ్చు. అతడి తరపున నేను ఓ మాట చెబుతున్నా. ఓపెనింగ్ ప్లేస్ చాలా కీలకం. మాకు టాప్ ప్లేయర్లు ఉన్నారు. స్టీవ్ స్మిత్కు అత్యుత్తమ స్థానం సెకండ్ డౌన్. లబుషేన్ మూడో స్థానంలో వస్తే మా జట్టు సమతూకంగా ఉంటుంది. జట్టుకు ఏది ముఖ్యమో దానిని అమలుచే-యడానికే చూస్తాం. డేవిడ్ వార్నర్ ఉన్నప్పుడు చాలా దూకుడుగా ఆడాం. వార్నర్ ఓపెనర్ వచ్చేవాడు. స్మిత్ నాలుగో స్థానంలో పరుగులు రాబట్టేవాడు. వార్నర్ తర్వాత.. స్మిత్ ఓపెనర్గా వచ్చినప్పుడూ మేం మ్యాచ్లు గెలిచాం. కానీ, అంతకుముందు చేసినట్లు ఎక్కువ పరుగులు రాబట్టలేదు. విజయానికి సరిపడా చేశామని భావిస్తున్నా. బోర్డర్ -గావస్కర్ ట్రోఫీలో నాతోపాటు ఓపెనింగ్కు ట్రావిస్ హెడ్ అయితే బాగుంటుంది. మునుపటిలా ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుంది" అని ఖవాజా తెలిపాడు. డేవిడ్ వార్నర్ టెస్టు క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. ఆసీస్ 8 ఇన్నింగ్స్లో కేవలం ఒక్కసారి మాత్రమే 300+ స్కోరు చేయగలిగింది.

# నీ కుమారుడితో ఆడిన తర్వాతే రిటైర్ అవుతా: పీయూశ్ చావ్లా

**విశ్వంభర (క్రీడా విభాగం):** "అప్పుడు సచిన్ ఆడా... ఆయన కుమారుడితో ఆడా.. నీతోనూ ఆడా... భవిష్యత్తులో నీ కుమారుడితో కూడా ఆడిన తర్వాతే రిటైర్ అవుతా" భారత వెటరన్ క్రికె-టర్ పీయూష్ చావ్లా ఓ కుర్రాడితో అన్న మాటలివి. తన రిటైర్మెంట్ గురించి వ్యాఖ్యాత శుభంకర్ మిశ్రా అడిగిన ప్రశ్నకు చావ్లా ఇలా స్పందించాడు. ఐపీ-ఎల్(IPL) 2024లో పీయూశ్ చావ్లా (35) ముంబై ఇండియన్స్ తరపున ఆడాడు. తాజాగా చావ్లా, పృథ్వీ షాలు శుభంకర్ మిశ్రా షోలో పాల్గొన్నారు. ఐపీఎల్ నుంచి ముందు మీరు రిటైర్ అవుతారా? ధోనీ అవుతారా? అని చావ్లాను వ్యాఖ్యాత అడిగారు. దానికి సమాధానంగా 'మహీ భాయ్' అంటూ పీయూష్ నవ్వుతూ సమాధానమిచ్చారు. మధ్యలో యువ క్రికెటర్ పృథ్వీ షా కలగజేసుకొని 'ఇక చాలు భయ్యా.. మీరు ఆగిపోండి' అని అనడంతో చావ్లా ఆసక్తికరంగా స్పందించాడు. మీ అబ్బా-యితో కూడా ఆడిన తర్వాత రిటైర్ అవుతానంటూ బదులిచ్చాడు. దీంతో షోలో నవ్వులు పూశాయి. పీయూశ్ చావ్లా 2007లో భారత క్రికెట్ జట్టు-లోకి అరంగేట్రం చేశాడు. భారత్ 2007, 2011 ప్రపంచ కప్పుల విజేతగా నిలిచిన సమయంలో భారత జట్టులో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. కాగా అప్పట్లో భారత జట్టుకు ధోనీ కెప్టెన్గా వ్య-వహరించాడు. 2020లో ధోని తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్పై స్పష్టతనిచ్చాడు. అయితే పీయూశ్ తన రిటైర్మెంట్ గురించి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# స్వల్ప నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**విశ్వంభర (బిజినెస్):** అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాల నడుమ శుక్రవారం ఫ్లాట్ గా ప్రారంభమైన సూచీలు రోజంతా దాదాపు అదే బాటలోనే పయనించాయి. చివరకు స్వల్ప నష్టాలతోముగిశాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ ఇందుకు కారణం. అయితే ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం రాణించాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 71.77 పాయింట్ల నష్టం (0.09 శాతం) తో 82,890.94 పాయింట్లతో సరిపెట్టుకుంటే, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 32.40 (0.13 శాతం) పాయింట్ల నష్టంతో 25,356.50 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీలో 32 స్టాక్స్ నష్టాల్లో కొనసాగాయి. ఎస్బీఐ లైఫ్, అదానీ పోర్ట్స్, హెచ్డీఎఫ్సీ లైఫ్; ఐటీసీ, కోల్ ఇండియా స్టాక్స్ 1.65 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు విప్రో, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్, గ్రాసిం తదితర స్టాక్స్ 3.78 శాతం వరకూ లాభాలు గడించాయి. బీఎస్ఈలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్ టెల్, ఎన్టీపీసీ, మారుతి సుజుకితోపాటు 19 స్టాక్స్ నష్టపోయాయి. బజాజ్ ఫిన్ సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు తదితర 11 స్టాక్స్ లాభాలతో పుంజుకున్నాయి. విప్రో నాలుగు శాతం పుంజుకోగా, నిఫ్టీ మిడ్ క్యాప్-100 తాజాగా 52 వారాల గరిష్టాన్ని తాకింది. స్పైస్ జెట్, బంధన్ బ్యాంక్ స్టాక్స్ తాజా గరిష్ఠం నమోదు చేశాయి. బంగారం ధరలు పెరగడంతో జ్యువెల్లరీ స్టాక్స్ పుంజుకున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో యూఎస్ డాలర్ మీద రూపాయి మారకం విలువ రూ.83.90 వద్ద ముగిసింది. ఇక గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 72.71 డాలర్ల వద్ద తచ్చాడుతోంది. గురువారం తొలిసారి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 83 వేల మార్కును దాటేసి 83,116.19 పాయింట్ల గరిష్ట స్థాయికి దూసుకెళ్లింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 1439.55 పాయింట్ల లబ్ధితో 82,962.71 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 25,433.35 పాయింట్ల ఆల్ టైం ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.7695 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు.

# అవన్నీ తప్పుడు ఆరోపణలు

**తొలిసారి మౌనం వీడిన సెబీ చీఫ్**




**ముంబయి:** తనపై వచ్చిన ఆరోపణల పై సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ తొలిసారి స్పందించారు. సెబీ చీఫ్ గా ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజ-నాలు పొందారంటూ తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టారు. ఆ ఆరోపణలు తప్పని, దురుద్దే-శాలతో కూడినవని పేర్కొన్నారు. సెబీ నిబంధ-నలు, మార్గదర్శకాలకు కట్టుబడి ఉన్నానంటూ పేర్కొన్నారు. ఈ మేరకు తన భర్తతో ధావల్ బచ్ తో కలిసి ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. అదానీ గ్రూప్ తో పాటు మరికొన్ని కార్పొరేట్ సంస్థల వ్యవహారంలో సెబీ చీఫ్పై ఇటీవల ఆరో-పణలు వచ్చిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ కంపెనీలపై కావాలనే ఆమె నెమ్మదిగా దర్యాప్తు చేస్తున్నారని, ఇందుకు కారణం బచ్ గతంలో ఆ గ్రూప్లో పెట్టిన పెట్టుబడులు, ఒప్పందాలే కారణమని హిండెన్బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆపై కాంగ్రెస్ కూడా ఆమెపై విమ-ర్శలు ఎక్కు పెట్టింది. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం అందుకుంటున్నారని, అలాగే, మాధవి దర్యాప్తు చేస్తున్న కంపెనీల నుంచి ఆమె భర్త ధావల్ బచ్కు చెందిన కన్సల్టెన్సీ సంస్థ ఆదా-యాలను ఆర్జిస్తోందన్నది ఆరోపణలు చేసింది. మహీంద్రా గ్రూప్ నుంచి ధావల్ బచ్ రూ.4.78 కోట్లు పొందారని కాంగ్రెస్ ఆరోపించగా.. సెబీ ఛైర్పర్సన్ మాధవి నియామకానికి మూడేళ్ల ముందే ధావల్ తమ గ్రూప్లో చేరారని మహీంద్రా పేర్కొన్న సంగతి తెలిసిందే. డాక్టర్ రెడ్డీస్ కూడా తాము ధావల్ సేవలకు రూ.6.58 లక్షలు చెల్లిం-చామని.. అది మాధవీ సెబీ ఛైర్పర్సన్ కాకము-నుపేనని వివరించింది. తాము సెబీ నిబంధనలు/ ఆదేశాల కిందకు ఎప్పుడూ రాలేదని పిడిలైట్ పేర్కొంది. అయితే, ఈ ఆరోపణలపై ఇంకా బచ్ స్పందించలేదంటూ హిండెన్బర్గ్ ఆరోపించిన వేళ.. ఈ ప్రకటన విడుదల చేయడం గమ-నార్హం. అందులో తమపై వచ్చిన ఆరోపణలపై అంశాల వారీగా ఇరువురూ వివరణ ఇచ్చారు. తమ ఆదాయపు పన్ను రిటర్నుల ఆధారంగా తమపై ఈ ఆరోపణలు చేశారని, వాటిని అక్రమ మార్గంలో సంపాదించడం వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనతో పాటు, ఐటీ చట్టం ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు.

# వరద బాధితులకు ఐసీఐసీఐ క్లెయిమ్స్ సరళతరం




**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరదల బారిన పడిన వ్యక్తుల నామినీలు/లబ్ధిదారుల కోసం క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సరళతరం చేసింది. ప్రకృతి వైపరీత్యంతో తలెత్తిన విషాద తీవ్రతను గుర్తించి, బాధిత కుటుంబాలకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును అందించే దిశగా డెత్ క్లెయిమ్లను వేగవంతంగా పరిష్కరించేందుకు కంపెనీ కట్టుబడి ఉందని కంపెనీ పేర్కొంది. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY) లో భాగమైన వాటితో పాటు అన్ని క్లెయిమ్లు కేవలం మూడు ప్రాథమిక డాక్యుమెంట్ల ఆధారంగా ప్రాసెస్ చేయనున్నట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ అమీష్ బ్యాంకర్ తెలిపారు.

ఐఎఫ్ఎస్సీ కోడ్తో కూడిన బ్యాంకు అకౌంట్ నంబర్ లేదా బ్యాంక్ అకౌంట్ క్యాన్సిల్డ్ చెక్కు కాపీ ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక మున్సిపల్ అధికారులు జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం లేదా ఆస్పత్రులు, ప్రభుత్వాధికారులు లేదా పోలీసులు జారీ చేసిన మృతుల జాబితా సమర్పించొచ్చు. పాన్ కార్డు/ఫారం 60 వంటి చెల్లుబాటయ్యే కేవైసీ పత్రాల కాపీలు, ఇటీవలి ఫొటో, అధికారికంగా చెల్లుబాటయ్యే ఏదైనా డాక్యుమెంట్ (ఆధార్ కార్డు, పాస్పోర్ట్, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్ ఐడీ, ఉపాధి హామీ జాబ్ కార్డు లేదా నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ జారీ చేసిన లెటర్) అందిస్తే సరిపోతుందని పేర్కొంది. క్లెయిమ్ సంబంధ సందేహాలేవైనా ఉంటే నివృత్తి కోసం కంపెనీకి చెందిన 24X7 క్లెయిమ్ కేర్ హెల్ప్ లైన్ నంబరు 1800-2660కి కాల్ చేయొచ్చని పేర్కొంది. లేదంటే ప్రత్యామ్నాయంగా తమ క్లెయిమ్లను claimsupport@iciciprulife.comకి మెయిల్ చేయొచ్చని, ICLAIM పాలసీ నంబరు రాసి 56767కి ఎస్ఎంఎస్ చేయొచ్చు లేదా www.iciciprulife, com/claims సందర్శించవచ్చని తెలిపింది.

# జీవిత కాల గరిష్టానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు



**విశ్వంభర (బిజినెస్):** భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు తాజాగా మరో జీవిత కాల గరిష్టానికి చేరు-కున్నాయి. సెప్టెంబర్ ఆరో తేదీతో ముగిసిన వారానికి 5.2 బిలియన్ డాలర్లు వృద్ధి చెంది, భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 689.24 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్బీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. అంత-కుముందు ఆగస్టు 30తో ముగిసిన వారానికి 2.3 బిలియన్ డాలర్లు పెరిగిన ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 683.99 బిలియన్ డాలర్లకు చేరుకున్న సంగతి తెలిసిందే.ఫారెక్స్ రిజర్వు నిల్వల్లో ప్రధానమైన 'ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్సీఏ) 5.10 బిలియన్ డాలర్లు వృద్ధి చెంది 604.1 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. బంగారం రిజర్వు నిల్వలు 129 మిలియన్ డాలర్లు వృద్ధి చెంది 61.98 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్స్) నాలుగు మిలియన్ డాలర్లు పుంజుకుని 18.47 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 9 మిలియన్ డాలర్లు పెరిగి 4.63 బిలియన్ డాలర్లకు చేరాయి.

# వడ్డీ రేట్ల కోత వైపు తొందరపడి నిర్ణయం తీసుకోం

## ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్



**విశ్వంభర (బిజినెస్):** ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండడంతో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా వడ్డీ రేట్ల కోత ప్రారంభిస్తుందనే అంచనాలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా వడ్డీ రేట్లలో మార్పులు చేయొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈవిషయంపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడారు. సింగపూర్లో నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఫైనాన్స్ ఫోరం 2024లో పాల్గొన్న ఆయన.. రేట్ల కోతతో పాటు వివిధ అంశాల గురించి ప్రస్తావించారు. ద్రవ్యోల్బణం 2-6 శాతం మధ్య ఉంచాలన్న లక్ష్యాన్ని చేరుకోగలిగామని ఈసందర్భంగా శక్తికాంత దాస్ పేర్కొన్నారు. అయితే, తమ లక్ష్యం 4 శాతమని చెప్పారు. పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లోనూ దీనిపై చర్చించామని తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినంతమాత్రన.. వడ్డీ రేట్ల కోత వైపు తొందరపడి నిర్ణయం తీసుకోబోమని చెప్పారు. ఇతర కేంద్ర బ్యాంకు విధానకర్తలూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే, దేశీయ వృద్ధిలో ప్రైవేటు వినియోగం, పెట్టుబడులది కీలకపాత్ర అని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తర్వాత భారత ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభం నుంచి బయటపడి వేగంగా పుంజుకుందన్నారు. 2021-24 మధ్య సగటున 8 శాతం కంటే ఎక్కువ వాస్తవ జీడీపీ వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.2 జీడీపీ వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. అతిపెద్ద వాణిజ్య రియల్ఎస్టేట్ సంస్థలకు రుణాలు అందిస్తున్న బ్యాంకులకు షార్ప్రెల్లర్ సంస్థల నుంచి ముప్పు పొంచి ఉందని, ఆయా సంస్థలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రపంచ రుణాలు పెరగడంపై శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తంచేశారు. అసాధారణ రీతిలో పెరిగిపోతున్న ఈ రుణాలు అభివృద్ధి చెందిన, అతి తక్కువ, మధ్యాదాయ ఆర్థిక వ్యవస్థలకు ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు.

# నా ఎక్స్ అకౌంట్ హ్యాక్ అయింది

**విశ్వంభర, సినిమా :** గత కొంతకాలంగా హ్యాకర్లు సెలబ్రిటీలకు షాక్ ఇస్తున్నారు. పలువురు హీరో, హీరోయిన్లకు సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్లను హ్యాక్ చేస్తున్నారు. తాజాగా లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ లిస్టులో చేరింది. ఆమె అధికారిక ఎక్స్ హ్యాండిల్ ను ఆగంతకులు హ్యాక్ చేశారు. ఈ విషయాన్ని నయనతార అఫీషియల్ గా వెల్లడించింది. తన ఎక్స్ హ్యాండిల్ నుంచి వచ్చే మెసేజ్ లు, ట్వీట్లకు స్పందించ కూడదని నయనతార తన అభిమానులకు వెల్లడించింది. ఇప్పటికే తన అకౌంట్ హ్యాక్ కు సంబంధించి పోలీసులకు కంప్లైంట్ చేసినట్లు వెల్లడించిన ఆమె, త్వరలో తన అకౌంట్ రికవరీ అవుతుందని చెప్పుకొచ్చింది. "నా అకౌంట్ హ్యాక్ అయ్యింది. దయచేసి అనవసర, అసభ్య మెసేజ్ లు పోస్టు అయినా పట్టించుకోకండి" అని వెల్లడించింది. ప్రస్తుతం ఈమె చేసి ట్వీట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆగస్ట్ 2013లో మైక్రోబ్లాగింగ్ సైట్ లో చేరిన నయనతారకు ఈ ప్లాట్ ఫారమ్‌లో 3 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. నయనతార ఎక్స్ అకౌంట్ హ్యాక్ అయ్యిందని ప్రకటించడంతో ఆమె అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె పోస్టుకు అభిమానులు పెద్ద సంఖ్యలో రియాక్ట్ అవుతున్నారు. "వెరిఫైడ్ అకౌంట్ ఎలా హ్యాక్ అయ్యింది? బ్లూ టిక్ ఉన్నా భద్రత కల్పించడంతో ఎక్స్ యాజమాన్యం విఫలం అయ్యింది" అని ఓ నెటిజన్ రాశాడు. "ఇది నిజంగా షాకింగ్ విషయం. హ్యాకర్లు తరచుగా సెబ్రటిటీలను టార్గెట్ చేస్తున్నారు. మీ అకౌంట్ హ్యాక్ అయినందుకు ఇబ్బంది పడకండి. మీ అకౌంట్ సేఫ్ గా ఉంచుకునేందుకు అవసరమైన



చర్యలు తీసుకోండి. మీ అభిమానులు ఎప్పుడూ మీకు సపోర్టుగా ఉంటారు" అని మరో నెటిజన్ రాసుకొచ్చాడు.

ఇక నయనతార సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తోంది. గత ఏడాది షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' మూవీతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టి బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుంది. ఇప్పుడు తమిళ్ తో పటు కన్నడ, మలయాళ సినిమాల్లోనూ నటిస్తోంది. టెస్ట్ సినిమాతో పాటు తని ఒరువన్ పార్ట్ 2, మన్నన్‌గట్టి 1960, డియర్ స్టూడెంట్స్ ఇలా బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది.

# సత్యం సుందరం టీజర్ రిలీజ్



**విశ్వంభర, సినిమా :** హీరో కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్ లో రాబోతున్న హోల్సమ్ ఎంటర్‌టైనర్ సత్యం సుందరం. 96 ఫేమ్ సి ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. టీజర్‌ని విడుదల చేసి మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ టీజర్ కార్తీ, అరవింద్ స్వామి రెండు వరల్డ్స్ ని ప్రజెంట్ చేసింది, వారి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీని హైలైట్ గా వుంది. వీరిద్దరు డిఫరెంట్ లైఫ్ స్టయిల్ లో ఆకట్టుకున్నారు. కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీ గా కనిపించారు. 96లో డ్రామాని డీల్ చేయడంలో తన సత్తా చాటిన సి ప్రేమ్ కుమార్ లీడ్ రోల్స్ ని అద్భుతంగా ప్రజెంట్ చేశాడు. కార్తీ, అరవింద్ స్వామి డిఫరెంట్ రోల్స్ లో మ్యాజిక్ క్రియేట్ చేసారు. ఈ టీజర్ గ్రేట్ ఇంపాక్ట్ ని క్రియేట్ చేసింది. ఈ సినిమాలో శ్రీ దివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మహేంద్రన్ జయరాజు కెమెరా పనితనం అద్భుతంగా ఉంది, గోవింద్ వసంత బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఎమోషన్ ని ఎలివేట్ చేసింది. ఈ చిత్రానికి ఆర్ గోవింద్‌రాజ్ ఎడిటర్. సత్యం సుందరం హ్యూమరస్ అండ్ హార్ట్ వార్మింగ్ మూవీని టీజర్ ప్రామిస్ చేస్తోంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. సత్యం సుందరం సెప్టెంబర్ 28న విడుదల కానుంది.



# మత్తెక్కిస్తోన్న ప్రగ్యా..

**విశ్వంభర, సినిమా :** హాట్ హాట్ ఫోజులుతో కుర్రకారుకు కంటిమీద కునుకే లేకుండా చేస్తుంది బాలయ్య బ్యూటీ ప్రగ్యా జైస్వాల్. అందాల ప్రదర్శనలో ఈ బ్యూటీ రోజు రోజుకు డోస్ పెంచేస్తూ చిత్తు చేస్తుంది. ఫొటో షూట్‌లో పరువాలన్నీ వడ్డించేస్తూ పిచ్చెక్కించేస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి. మత్తెక్కించే అందాలతో మాయ చేస్తుంది ప్రగ్యా జైస్వాల్. అందాల ప్రదర్శనలో ఈ ముద్దుగుమ్మ ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం NBK109 మూవీలో నటిస్తోంది. అఖండ మూవీలో బాలయ్య సరసన నటించి మంచి గుర్తింపును తెచ్చుకున్న ఈ బ్యూటీ మరోసారి నటిస్తుంది. ప్రగ్యా జైస్వాల్ తన సినీ ప్రస్థానాన్ని 2014లో హిందీ సినిమాతో ప్రారంభించింది. "టిటో మేబీ" అనే ఈ చిత్రంలో ఆమె నటించింది. తెలుగులో ఆమెకు పెద్ద బ్రేక్ 2015లో క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన "కంచె" అనే చిత్రంతో వచ్చింది. ఈ సినిమాలో ఆమె "సీతాదేవి" అనే ప్రధాన పాత్రలో నటించింది. "కంచె" చిత్రం రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలోని ప్రేమకథగా ఉండగా, ప్రగ్యా తన పాత్ర ద్వారా మంచి గుర్తింపు పొందింది.

## 'విశ్వంభర' టీజర్‌కు
# డేట్ ఫిక్స్

**విశ్వంభర, సినిమా:** మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ట సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఓ దైవిక కార్యం నెరవేర్చడానికి భువిపై అడుగుపెట్టిన కారణజన్ముడికి, విశ్వంభర అనే లోకానికి మధ్య ఉండే సంబంధం, కార్యసాధనలో తను చేసే ప్రయాణం నేపథ్యంలో ఆద్యంతం సాహసం, సంభ్రమం కలబోతగా దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలో విహరింపజేసే చిత్రమిదని, విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అంటున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో టీజర్ ఎప్పుడొస్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం అక్టోబర్ 12న దసరా పర్వదినం సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో ప్రేక్షకులకు విశ్వంభర ప్రపంచాన్ని పరిచయం చేస్తారని చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.












Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com